ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్

మా కలం - సామాన్యుడి బలం

CELL : 9440352036

స్వర్ణసాగరం

WWW.SWARNASAGARAM.COM

PRGI : APTEL/26/A1104

జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

9440352036

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ

సంపుటి : 1, సంచిక : 211

పేజీలు : 8

శనివారం 24 అక్టోబర్ 2026

వెల : 2-00

ముంచుకొస్తున్న అర్ణబ్ తుపాను

- బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం
- 26 నాటికి తుపానుగా మారే అవకాశం
- దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో అతి భారీ వర్షాలు
- కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు
- నేటి నుంచి 2 రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు

3

దేశం ముందు వాస్తవాలు పెట్టండి

- మోదీకి ఖర్గే మూడు ప్రశ్నలు- చైనా పాలసీపై తీవ్ర విమర్శలు
- భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.
- చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్‌లు ఇచ్చేశారని ఆరోపించారు.
- అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి

2

శకునిని తలపిస్తున్న చంద్రబాబు

- తిరగబడండి.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి
- రాష్ట్ర ప్రజలకు మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు
- తొండి, అన్యాయం, దౌర్జన్యంతోనే స్థానిక ఎన్నికల నిర్వహణ
- సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా చంద్రబాబుకు, ఎస్ఈసీకి బుద్ధి రాలేదు
- సాక్ష్యాధారాలతో టీడీపీ గూండాల దాడులు, దౌర్జన్యాలపై ఫిర్యాదు చేశాం
- ఇప్పటికీ ఏ ఒక్కరినీ సస్పెండ్ చేయలేదు.. కనీసం బదిలీ కూడా చేయలేదు
- ఎస్ఈసీ, పోలీసులు, అధికారులు బాబుకు తొత్తులుగా మారిపోయారు
- ఇప్పుడే ఇలా ఉంటే పోలింగ్ ముగిసే నాటికి వీళ్ల అరాచకాలు

అమరావతి, స్వర్ణసాగరం

"ప్రజాస్వామ్యంలో నియంతృత్వ ధోరణి ప్రజ్వరిలలతే ప్రజలకు స్వేచ్ఛ ఉండదు.. ఎలాంటి హక్కులు ఉండవు. ఈరోజు నామినేషన్ పత్రాలు లాక్కొని చించేస్తున్నట్టుగానే రేపొద్దున మీ ఆస్తిపత్రాలతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే లాక్కొని చించేసి మీ ఆస్తి తమదంటారు. ప్రజలందరికీ ఒకటే పిలుపునిస్తున్నా. ఒక్కసారి ఆలోచించమని కోరుతున్నా. ప్రతీ ఒక్కరూ తిరగబడండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోండి. లేకుంటే మీ ఆస్తులు, మీ హక్కులకే కాదు.. మీ ప్రాణాలకు కూడా రక్షణ ఉండదు' అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న హింసాకాండ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై దాడులు, ఎంపీటీసీ, - మిగతా3లో

ముగిసిన పరిషత్ ఎన్నికల నామినేషన్ల ఘట్టం

- 25న తుది జాబితా ప్రకటన
- రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది.
- నామినేషన్ల ఘట్టం చివరిరోజున పోలీసులు కేంద్రాల భారీ బందోబస్తు ఏర్పాటు
- నామినేషన్ల చివరి రోజు బాపట్ల జిల్లా చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో సందడి వాతావరణం నెలకొంది

భారత్ లక్ష్యంగా చేసుకున్నది కాదు

- అమెరికా వర్క్ వీసా రూల్స్‌పై రూబియో
- అమెరికా జాతీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని రూబియో స్పష్టం

2

విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి

- వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయాలి
- సమాజంలో తలెత్తుతున్న కొత్త సవాళ్లు, దుర్గతలను ఎదుర్కోవడంతో పాటు దేశాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకం కావాలి
- గడిచిన దశాబ్దాల్లో కాలం మారింది
- దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి
- కొత్త సామాజిక దుర్గతలు బయటపడ్డాయి

2

లైసెన్స్‌కు కొత్త రూల్స్

- డ్రైవింగ్ టెస్ట్ పాస్ మార్కులు 75 శాతానికి పెంపు
- భారతీయులు, విదేశీయులకు జారీ చేసే లేదా రెన్యూవల్ డ్రైవింగ్ లైసెన్సుల కోసం వేర్వేరు రంగుల పథకాలను ప్రవేశపెట్టాలని కేంద్రం భావన
- విదేశీయులను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈ ప్రత్యేక రంగుల విధానాన్ని ప్రతిపాదించింది



నవంబరు నుంచి చింతలపూడి పనులు పునఃప్రారంభం

- పోలవరం కుడి, ఎడమ కాలువల విస్తరణపై దృష్టి
- నిరంతర కార్యక్రమంగా జలధార-జలహారతి
- తుపాను వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు
- సమర్ధ నీటి నిర్వహణతో వర్షపు నీటి సద్వినియోగంపై దిశానిర్దేశం
- ఎన్నికల పనుల్లో బిజీగా ఉన్నా జల వనరుల శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, స్వర్ణసాగరం

ఈ ఏడాది నవంబరు నుంచి చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇప్పటికే పర్యావరణ అనుమతులన్నీ వచ్చినందున త్వరితగతిన పనులు పునః ప్రారంభించాలని జలవనరుల శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి రాజకీయపరమైన అంశాల్లో బిజీగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రెండు గంటలకు పైగా సమయాన్ని జలవనరుల శాఖపై సమీక్షకు వెచ్చించారు. అటు బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచనలు జారీ చేశారు. రాష్ట్రంలో జలవనరుల సమర్ధ నిర్వహణ, నదుల అనుసంధానమే లక్ష్యంగా జల వనరుల శాఖ పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.. రాష్ట్రంలో గుర్తించిన 36 ప్రాధాన్య ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, 2028 డిసెంబరు నాటికి అన్ని ప్రాజెక్టులనూ అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు, ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కాలువలపై సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. జల హారతి కార్పొరేషన్ ద్వారా జల వనరుల శాఖకు ఆదాయాన్ని సమకూర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సాంకేతిక అంశాల - మిగతా3లో

విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి

విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలని, ఆత్మనిర్భరత వైపు పౌరులను ప్రేరేపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో తలెత్తుతున్న రుగ్మతలు, కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. దిల్లీలోని భారత మండపంలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు జరగనున్న చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక ఆలోచనా విధానమని కొనియాడారు. భారత్ సంస్కృతికి జన్మస్థలమని, దేశ ఉనికికి పునాది అని ప్రధానమంత్రి అన్నారు. "గడిచిన దశాబ్దాల్లో కాలం మారింది. దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి. కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి. ఈ రోజు, వాటిని పరిష్కరించే బాధ్యత మనందరిపై ఉంది. మనల్ని విభజించాలని చూసే శక్తులకు వ్యతిరేకంగా మనం సమాజాన్ని ఏకం చేయాలి. మన పౌరుల్లో ఆత్మనిర్భరత పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తిని నింపాలి. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలి. ఈ లక్ష్యాల కోసం మనం మరింత చురుకుగా వ్యవహరించాలి."

వ్యక్తిగత పురోగతి అనేది జాతీయ అభివృద్ధికి ఒక సాధనంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా స్వామి చిన్మయానంద బోధనలను, ఆధ్యాత్మిక వృద్ధిని దేశాభివృద్ధికి అనుసంధానించేందుకు ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. 'వయం రాష్ట్ర జాగృయామ్ పురోహితాః' అనే వేద మంత్రాన్ని చెబుతూ, దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా మార్చేందుకు ప్రజలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

"మిత్రులారా మన వేదాలు మనకు 'వయం రాష్ట్ర జాగృయామ్ పురోహితాః' అని పిలుపునిస్తున్నాయి. అంటే దేశ శ్రేయస్సును కోరుకునేవారిగా, మనం దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా తీర్చిదిద్దాలి. స్వామి చిన్మయానంద తన జీవితాంతం ఈ మంత్రాన్నే స్ఫూర్తిగా తీసుకుని జీవించారు. ఆధ్యాత్మిక విషయాల గురించి ఆయన ఎంతటి అంకితభావంతో మాట్లాడేవారో, జాతీయ అంశాల గురించి కూడా అంతే ఉత్సాహంతో, స్పష్టతతో మాట్లాడేవారు. ఎందుకంటే మన దేశమే మన సంస్కృతికి జన్మస్థానం. పూజ్య గురుదేవ్ స్వామి చిన్మయానందను ఈ రూపంలో చూడటం, ఆయన హోలోగ్రాఫిక్ ప్రతిరూపంతో సంభాషించే అవకాశం లభించడంతో నేను 33 ఏళ్లు వెనక్కి ప్రయాణించినట్లు అనిపించింది. 1993లో వడోదరలో గురుదేవ్‌తో నా భేటీ, మా మధ్య జరిగిన సంభాషణలు, ఆయన చూపిన వాత్సల్యం, ఆయన ఆశీస్సులు అన్నీ ఈరోజు కళ్లముందు కదలాడాయి. ఈ అద్భుతమైన అనుభవాన్ని సాకారం చేసిన చిన్మయ మిషన్ సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆ సంభాషణలో ప్రధానాంశం యువశక్తిని పెంపొందించడం, తద్వారా ఒక బలమైన, సమర్థమంతమైన భారతదేశాన్ని నిర్మించడం పైనే చర్చించాం. వారిని కలిసిన కొన్నేళ్లకే, ప్రజలు నన్ను గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారు."

భారతీయుల్లో తమ దేశం పట్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే స్వామి చిన్మయానంద లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. "ఈ దేశమే మన ఉనికికి పునాది. మన ఆధ్యాత్మిక పురోగతిని వ్యక్తిగత వికాసంతో అనుసంధానించాలని, దానిని దేశాభివృద్ధికి ఒక సాధనంగా మార్చుకోవాలని స్వామీజీ మనకు బోధించారు. భారతీయుల్లో దేశం పట్ల ఆత్మగౌరవాన్ని నింపడమే ఆయన లక్ష్యం. ఇదే ఉద్దేశంతో ఆయన 'గీతా జ్ఞాన యజ్ఞాన్ని' ప్రారంభించి, ఉపనిషత్తులు, వేదాంతం మన ఇతర శాస్త్రాల జ్ఞానాన్ని సామాన్య ప్రజల వరకు చేరవేశారు. ఆయన తీసుకున్న ఆ సంకల్పం ఫలితాలను ఇప్పుడు మనం చూడవచ్చు" అని ప్రధానమంత్రి మోదీ అన్నారు.

దేశం ముందు వాస్తవాలు పెట్టండి

అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైన్యంతో కొనసాగుతున్న ఘర్షణలపై ప్రధాని మోదీ, కేంద్రం మౌనం వహించడంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ముఖ్యంగా భారత విదేశాంగ విధానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. చైనాకు ఇప్పటికే చాలా క్లీన్ చిట్‌లు ఇచ్చేశారని, ఇకనైనా ప్రధానమంత్రి మోదీ దేశం ముందుకు వచ్చి అసలు వాస్తవాలు ఏంటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి ప్రశ్నలు సంధించారు. అరుణాచల్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ×ది్గూ-డైరెక్టర్ జనరల్ శతృజీత్ కపూర్ చేసిన వ్యాఖ్యలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

"చైనాకు ఇచ్చిన క్లీన్ చిట్‌లు చాలు. ప్రధాని మోదీ భారత్ ముందు వాస్తవాలు చెప్పాలి! మూడు ప్రశ్నలకు సమాధానాలు కావాలి: 1. జాతీయ భద్రత: అరుణాచల్ ప్రదేశ్‌లో ౹ాూాతో ఘర్షణలు కొనసాగుతున్నాయని ×ది్గూ డీజీ ధ్రువీకరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డోక్లాం, గల్వాన్ తర్వాత మరో తీవ్రమైన ఘర్షణ చోటుచేసుకుంటోందా? ఆగస్టులో టాక్సింగ్ సమీపంలో చైనా చొరబాట్లపై నివేదికలు వెలువడ్డాయి. అయినప్పటికీ, కేవలం 180 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నట్లు చెబుతున్న వాచా-దమాయ్‌లో కార్ప్స్ కమాండర్ స్థాయి చర్చలు జరిగి 47 రోజులు గడిచినా, ఘర్షణలు కొనసాగుతున్నాయి. భారతదేశ గస్తీ మార్గాలకు ఆటంకం కలిగిందా? అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో విడదీయరాని భాగం. దేశాన్ని ఎందుకు చీకట్లో ఉంచుతున్నారు? 2. ఆర్థిక భద్రత: గల్వాన్‌లో 20 మంది భారత సైన్యపు వీరయోధుల త్యాగం తర్వాత, చైనా దిగుమతులు 102శాతం పెరిగాయి. అదే సమయంలో చైనాతో భారతదేశ వాణిజ్య లోటు 155శాతం పెరిగి 112.16 బిలియన్? డాలర్లకు చేరింది. భారత ఎగుమతులకు చైనా ఆటంకం కలిగిస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా అంగీకరిస్తున్నారు. అయినా, ప్రభుత్వం చైనా పెట్టుబడులపై ఆంక్షలను సడలిస్తూ, అర్హత కలిగిన చైనా అనుబంధ సంస్థలకు పీఎల్ఐ (౹ాా×) ప్రయోజనాలను పరిశీలిస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా' కాస్తా 'ఇంపోర్ట్? ఫ్రమ్ చైనా'గా మారిందా? 3. దౌత్యపరమైన జవాబుదారీతనం: కనీసం 23 సార్లు మోదీ- జిన్?పింగ్ మధ్య సమావేశాలు, సంభాషణలు జరిగాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబల్ 25 ప్రత్యేక ప్రతినిధుల పర్యటనలు చేశారు. 36 ఔవీజజ సమావేశాలు, వరుసగా ౹ాజూా, దీ=×జూా శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి. ఈ కార్యకలాపాలు ఎలాంటి స్పష్టమైన ఫలితాలను అందించాయి? మే 2020కి ముందు భారతదేశానికి ఉన్న గస్తీ హక్కులు పూర్తిగా పునరుద్ధరించారా? మన సాయుధ దళాలపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. కానీ జాతీయ భద్రతకు జవాబుదారీతనం అవసరం, అంతేగానీ దౌత్యపరమైన ఫోటో, ఆలింగన రాజకీయాలు కాదు! ప్రతిపక్షంపై దాడి చేయడానికి బదులుగా, ప్రధాని మోదీ పార్లమెంటు, దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలి."

కేంద్రం వైఖరితో దేశానికి ఏమి దక్కింది : ఖేడా

అటు కేంద్రం భారతదేశ ప్రయోజనాలను చైనాకు అప్పగించిందని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆరోపించారు. బీజింగ్ పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరి వల్ల దేశానికి ఏమి దక్కిందని ప్రశ్నించారు. ఏప్రిల్ 2020కి ముందు భారత బలగాలు ప్రవేశించిన ప్రాంతాల్లో ఇప్పుడు గస్తీ నిర్వహించగలవా అని అడిగారు. దిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖేడా మాట్లాడారు. సరిహద్దు ఉద్రిక్తతలు, వాణిజ్య సంబంధాలు, వీసా ఆంక్షలు, భారతదేశంలోకి చైనా కార్మికుల ప్రవేశం వంటి అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించారు. "మనకు ఏమి దక్కింది? చైనా వ్యతిరేకత వల్ల మనకు ఎలాంటి హోదా లభించింది? ఏప్రిల్ 2020కి ముందు మనం గస్తీ కాసిన ప్రదేశాల్లో ఈ రోజు గస్తీ కాయగలమా? వీటన్నిటికీ బదులుగా మీరు ఏదైనా తీసుకోవాల్సింది కాదా? దేశంలోని ఎంఎస్ఎంఈలను నాశనం చేస్తారు. మీరు చైనాకు భయపడి, చైనా కోరుకున్నది ఏదైనా చేస్తారు. కేవలం చైనాకు భయపడటం వల్లే మీరు భారతదేశ ప్రయోజనాలను చైనాకు అప్పగిస్తూనే ఉన్నారు. మీరు తొలగించిన ప్రయాణ ఆంక్షలైనా, 99 బిలియన్ డాలర్ల నుంచి 112 బిలియన్ డాలర్లకు పెరిగిన వాణిజ్య లోటు అయినా, పరిమితం చేసిన వీసాలు అయినా, ఇక్కడికి వచ్చే చైనా కార్మికులకు, చైనా అధికారులకు మీరు అకస్మాత్తుగా మళ్లీ వీసాలను పెంచుతున్నారు. దీనివల్ల భారతదేశానికి ఏమి జరుగుతుంది? ఈ లొంగిపోవడం వల్ల మనం సాధించింది ఏమిటి?" అని ఖేడా ప్రశ్నించారు.

భారత ఆర్మీకి స్వదేశీ 'నాగాస్త్ర-2' ఆత్మాహుతి డ్రోన్లు

భారత సైన్యం అమ్ముల పొదిలోకి మరో శక్తిమంతమైన స్వదేశీ అస్త్రం చేరింది. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'నాగాస్త్ర-2' యాంటీ ట్యాంక్ లాయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థను భారత ఆర్మీకి అప్పగించింది. గాల్లో చక్కర్లు కొడుతూ శత్రువుల కదలికలను పసిగట్టి, ఆత్మాహుతి దాడితో యుద్ధ ట్యాంకులను తునాతునకలు చేయడం ఈ డ్రోన్ ప్రత్యేకత. రక్షణ రంగంలో ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి ఊతమిస్తూ నాగ్‌పుర్‌కు చెందిన సోలార్ డిఫెన్స్ సంస్థ 'నాగాస్త్ర-2' వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇందులో పగలు, రాత్రి వేళల్లో నిఘా పెట్టగల అత్యాధునిక కెమెరాలను అమర్చారు. 4 కిలోల శక్తిమంతమైన ట్యాండమ్ షేప్డ్-ఛార్జ్ వార్‌హెడ్ కలిగిన ఈ ఆత్మాహుతి డ్రోన్ 650 మిల్లీమీటర్ల మందపాటి ఉక్కు కవచం కలిగిన శత్రు యుద్ధ ట్యాంకులను సైతం సులభంగా చీల్చివేయగలదు.

ఈ నాగాస్త్ర-2 డ్రోన్ ఏకధాటిగా 60 నిమిషాల పాటు గాల్లో ఎగురుతూ లక్ష్యాలను వేటాడగలదు. ఒకవేళ దాడిని విరమించుకుంటే 25 కిలోమీటర్ల పరిధిలో దీన్ని తిరిగి సురక్షితంగా వెనక్కి రప్పించి మళ్లీ వాడుకోవచ్చు. ఇక 'ఫైర్ అండ్ ఫర్‌గెట్' విధానంలో అయితే 50 కిలోమీటర్ల దూరంలోని శత్రు స్థావరాలను ఇది కచ్చితత్వంతో ఛేదించగలదు.

జీపీఎస్ జామింగ్, స్పూఫింగ్‌లను తట్టుకునే జుజజవీ టెక్నాలజీ

ఆధునిక యుద్ధరంగంలో శత్రు దేశాలు ప్రయోగించే ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సవాళ్లను తిప్పికొట్టేలా నాగాస్త్ర-2లో 'ఎలక్ట్రానిక్ కౌంటర్-కౌంటర్ మెజర్స్ సాంకేతికతను జోడించారు. శత్రు సైన్యం కమ్యూనికేషన్ జామింగ్, జీపీఎస్ జామింగ్ లేదా దారి మళ్లించడం వంటి ప్రయోగాలు చేసినా వాటిని తట్టుకుని నిర్దేశిత లక్ష్యాలను నాశనం చేసేలా దీన్ని తీర్చిదిద్దినట్లు సోలార్ డిఫెన్స్ సంస్థ వెల్లడించింది. సరిహద్దుల్లో శత్రువుల సాయుధ వాహనాలు, ట్యాంకులను ఎదుర్కోవడంలో నాగాస్త్ర-2 భారత సైన్యానికి కీలక అస్త్రంగా మారనుంది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ ప్రకారం, నాగాస్త్ర 2 ఆగస్టులో మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ లో సాంకేతిక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది.

ఇదిలా ఉండగా, కొద్ది రోజుల క్రితమే భారత సైన్యానికి 450 నాగాస్త్ర 1= లోయిటరింగ్ మందుగుండు సామగ్రిని అందించింది సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ ఈ వ్యవస్థకు సంబంధించి ఇది తమ అతిపెద్ద సింగిల్-బ్యాచ్ సరఫరా అని ఆ సంస్థ పేర్కొంది. సాంకేతిక పరీక్షల అనంతరం అత్యవసర సేకరణ కింద సైన్యం ఈ ఆర్డర్‌ను ఇచ్చిందని కంపెనీ తెలిపింది. ఈ పరీక్షల్లో నాలుగు కంపెనీలు పాల్గొన్నాయని, అయితే అవసరమైన అన్ని పారామితులను ప్రదర్శించిన ఏకైక కంపెనీ తమదేనని ౹ాణూాా పేర్కొంది. స్వల్ప-శ్రేణి కార్యకలాపాల కోసం సైన్యం నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి నాగాస్త్ర 1= వేరియంట్‌ను రూపొందించారు. లక్ష్యాన్ని ఛేదించే కచ్చితత్వాన్ని అంచనా వేయడంతో సహా, పలు ప్రత్యక్ష పరీక్షల ద్వారా ఈ వ్యవస్థ పనితీరును మూల్యాంకనం చేశామని ౹ాణూాా పేర్కొంది. ఈ సిస్టమ్‌లను లద్దాఖ్, ఉత్తర్?ప్రదేశ్‌లోని ఝాన్సీ సమీపంలోని బబినాతో సహా వివిధ ప్రదేశాల్లో పరీక్షించారని పేర్కొంది. ప్రస్తుత యుద్ధ సమయంలో స్వదేశీంగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ సైన్యానికి తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారమని కంపెనీ అభివర్ణించింది. ఖచ్చితత్వం లేదా నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఈ వ్యవస్థ ఈ సామర్థ్యాన్ని అందిస్తుందని చెప్పింది. అంతకుముందు 2025లో భారత సైన్యం సుమారు 450 నాగాస్త్ర-1= లోయిటరింగ్ మ్యూనిషన్లను కొనుగోలు చేయడానికి సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్‌కు ఆర్డర్ ఇచ్చింది.

భారత్ లక్ష్యంగా చేసుకున్నది కాదు

అమెరికా వర్క్ వీసా నిబంధనల్లో ఇటీవలి తీసుకువచ్చిన మార్పులపై ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త నిబంధనలు భారత్? వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని తెలిపారు. అమెరికా జాతీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా కార్మికులకు ప్రాధాన్యం ఇస్తోందని రూబియో స్పష్టం చేశారు. భారత్‌లో పర్యటించిన ఆయన జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ నిబంధనలపై భారతదేశంలో నెలకొన్న ఆందోళనలను తగ్గించే విధంగా మాట్లాడారు. "ఇది భారతదేశాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయం కాదు. ఇది కేవలం భారతదేశంపై లక్ష్యంగా చేసుకున్నది కాదు. అమెరికాకు వచ్చి పనిచేయాలనుకునే భారతీయులపై, అలాగే మా వ్యాపార సంస్థలు నెలకొల్పాలని చూస్తున్న వారిపై ఇది ప్రభావం చూపుతుంది. కానీ ఇది భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్నది కాదు, ఇది ప్రపంచవ్యాప్తమైనది. అమెరికాలో వలస విధానం లోపభూయిష్టంగా ఉంది. మా వ్యాపార సంబంధిత వలస కార్యక్రమాలు చాలా సందర్భాల్లో విపరీతమైన మోసాలకు, దుర్వినియోగానికి గురయ్యాయి. వాటిని అర్థరహితంగా దుర్వినియోగం చేశారు. కాబట్టి ఈ విషయాలను పరిష్కరించాలి. అందుకే మేము వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాం. కానీ అవి భారతదేశాన్ని ఉద్దేశించినవి కావు. అవి ప్రపంచంలోని ఒక్క దేశానికే పరిమితం కాకుండా ప్రతి దేశానికైనా వర్తిస్తాయి." ఈ చర్యలన్నీ కేవలం అమెరికన్ కార్మికులను రక్షించడం, వారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడానికే ఉద్దేశించినవని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. "భారత ప్రభుత్వం ఎల్లప్పుడూ భారత ప్రజలకు, ఆ దేశ జాతీయ ప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తుందని నేను ఆశిస్తున్నాను. అలాగే అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలోని యునైటెడ్ స్టేట్స్ మన ప్రజలకు, మన కార్మికులకు, మన దేశానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వబోతోందని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటారని కూడా నేను ఆశిస్తున్నాను." అని రూబియో తెలిపారు. అంతకుముందు ఎనిమిది ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలకు శాశ్వత కార్మిక సర్టిఫికేషన్‌ను సస్పెండ్ చేస్తూ అమెరికా భారీ షాక్ ఇచ్చింది. ఇందులో మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టాటా, విప్రో, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, కాగ్నిజెంట్, అడోబ్ సంస్థలు ఉన్నాయి. అదే సమయంలో అమెరికా టెక్ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, అడోబ్‌లను కూడా ఈ కార్యక్రమం నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఆయా సంస్థల తరఫున హెచ్-1బీ వీసాపై అమెరికా వచ్చే ఉద్యోగులు గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడం కుదరదు. హెచ్-1బీ వీసా కార్యక్రమం దుర్వినియోగం నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. ఈ కంపెనీలకు సంబంధించి కొత్త వాటితో పాటు, పెండింగ్‌లో ఉన్న లేబర్ సర్టిఫికేషన్‌లను ఇకపై పరిశీలించమని కార్మికశాఖ మంత్రి కీత్ సాండర్లింగ్ ఆదేశించారు. 2009 నుంచి ఈ కంపెనీలు భారీగా శాశ్వత లేబర్ సర్టిఫికేషన్‌లను పొందాయని, అమెరికాకు చెందాల్సిన లక్షలాది ఉద్యోగాలను లాక్కున్నాయని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ముడి చమురు దిగుమతులపైనా మార్కో రూబియో స్పందించారు. వివిధ దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలన్న భారతదేశ నిర్ణయం, అమెరికా ఒత్తిడి వల్ల తీసుకోలేదన్నారు. ఇది కేవలం దాని స్వంత ప్రయోజనాల కోసమే తీసుకున్నదని స్పష్టం చేశారు. ఒకే సరఫరాదారుపై ఎక్కువగా ఆధారపడటం వల్ల దేశాలు అంతరాయాలకు గురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. "భారత్? తన ఇంధన సరఫరా వ్యవస్థను వైవిధ్యంగా మార్చడంలో పురోగతి సాధించింది. అది బెదిరింపుల వల్లనో లేదా అలాంటి ఇతర కారణాల వల్లనో చేయలేదు" అని రూబియో అన్నారు.

లైసెన్స్‌కు కొత్త రూల్స్

దేశంలో డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. 'సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్' సవరణల ముసాయిదా ద్వారా పలు విప్లవాత్మక మార్పులను తీసుకురానుంది. ఈ ముసాయిదాపై రాబోయే 30 రోజుల్లోగా ప్రజలు, భాగస్వామ్య పక్షాలు తమ అభ్యంతరాలు, సూచనలను తెలియజేయవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొంది. అవేంటంటే?

భారతీయులకు, విదేశీయులకు వేర్వేరు రంగుల్లో లైసెన్స్

ముఖ్యంగా భారతీయులు, విదేశీయులకు జారీ చేసే లేదా రెన్యూవల్ డ్రైవింగ్ లైసెన్సుల కోసం వేర్వేరు రంగుల పథకాలను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. విదేశీయులను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఈ ప్రత్యేక రంగుల విధానాన్ని ప్రతిపాదించింది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్సకు వీలుగా డ్రైవింగ్ లైసెన్సులపై వారి రక్త వర్గం, మొబైల్ నంబర్, అత్యవసర సంప్రదింపు నంబర్లను తప్పనిసరిగా పొందుపరచాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర మోటారు వాహనాల నిబంధనలకు చేసిన ముసాయిదా సవరణల్లో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ (వీశీ=ు౦) ప్రతిపాదించింది.

చివరి రోజు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు

వాకాడులో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ

చివరి రోజు 11 స్థానాలకు 23 నామినేషన్లు.. మూడో రోజు సజావుగా ముగిసిన ఘట్టం

స్వర్ణసాగరం, వాకాడు (అక్టోబర్ 23): వాకాడు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మూడో రోజు ప్రశాంతంగా ముగిసింది. గత రెండు రోజులుగా చోటు చేసుకున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో చివరి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కుంటాయోనన్న ఉత్కంఠ నెలకొంది. అయితే పోలీసుల పటిష్ట బందో బస్తు, అధికారుల పర్యవేక్షణతో నామినేషన్ల ప్రక్రియ సజావుగా పూర్తయింది. గడువు ముగిసే సమయానికి మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పిం చడంతో ఆయా స్థానాల్లో రాజకీయ సందడి నెలకొంది. తెలుగుదేశం, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థులు సైతం తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. కొండపురం, వాకాడు-1, వాకాడు-2, నెల్లిపూడి, తిరుమూరు, బాలిరెడ్డిపాలెం, దుగ్గరాజపట్నం, కల్లూరు, జమీన్ కొత్తపాలెం, నిడుగుర్తి, పూడిరాయదరువు స్థానాలకు వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నెల్లిపూడి ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, రౌతు లలిత నామినేషన్లు వేయగా, బహుజన్ సమాజ్ పార్టీ తరఫున పంట్రంగం వసంత్‌బరిలో నిలిచారు. ఇతర స్థానాల్లో వైసీపీ తరఫున కాకాని శ్రీనివాసులు, గూడూరు సుధ, సంగీతం హిమజ, బొజ్జా సుభాషిణి, ఎద్దు ఏడుకొండలు, మునస్వామి రెడ్డితో పాటు పలువురు అభ్యర్థులు నామినేష న్లు సమర్పించారు.

ఎమ్మెల్యే సూచనలతో సద్దుమణిగిన ఉత్కంఠ?

నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు ఉద్రిక్తతలు తలెత్తకుండా ఉండేందుకు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ టీడీపీ నేతలకు, పోలీసులకు పలు సూచనలు చేయడం స్థానికంగా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కేంద్రాల వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. దీంతో చివరి రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు చివరి రోజు 23 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అయితే మొత్తం నామినేషన్ల సంఖ్య, పార్టీ వారీగా అభ్యర్థుల వివరాలపై అధికారిక గణాంకాలను నిర్ధారించాల్సి ఉంది. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం ఆయా స్థానాల్లో బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది.

శకునిని తలపిస్తున్న చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి
జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలను చించేయడం, మరోవైపు యథేచ్ఛగా సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న ఎస్ఈసీ, చంద్రబాబు ప్రభుత్వ తీరును సాక్ష్యాధారాలతో ఎత్తిచూపుతూ నిప్పులు చెరిగారు. "స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న తీరును తప్పు బడుతూ సుప్రీంకోర్టు తీవ్రమైన మొట్టికాయలు వేసినా చంద్రబాబులో కానీ, ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) తీరులో కానీ ఎలాంటి మార్పు రాలేదు.
మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్లకు మించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల సందర్భంగా టీడీపీ గూండాలు దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్నారు. మహిళలని కూడా చూడకుండా చీరలు లాగి దుశ్శాసనపర్వానికి పాల్పడుతున్నా పట్టించుకునే వారులేరు. నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకుంటున్న టీడీపీ మూకలు, వారికి సహకరిస్తున్న పోలీసులు, ఎన్నికల అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా ఎన్నికలు సజావుగా జరుగుతున్నట్టు కోర్టులకు భ్రమ కల్పించేలా వైఎస్సార్‌సీపీ తరపున ఫేక్ నామినేషన్లు వేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేస్తున్నారు." అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

తొండి.. అన్యాయం..దౌర్జన్యం ఇదే చంద్రబాబు మార్క్ కుతంత్రం..

"రాష్ట్రంలో అన్నింటా విఫలమైన వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వంపై ఏ ఒక్క వర్గం సంతోషంగా లేరు. అందుకే స్థానిక ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి, ఎలాగైనా గెలిచేందుకు అంతులేని అక్రమాలకు పాల్పడుతున్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేశారు. ఎలాగైనా గెలవాలన్న ఆలోచనతో స్థానిక ఎన్నికల్లో అష్ట కుట్రలకు పాల్పడుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం యథేచ్ఛగా బేఖాతరు చేస్తున్నారు. ఎస్ఈసీ కానీ, చంద్రబాబు ప్రభుత్వం కానీ సుప్రీంకోర్టు ఆదేశాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అన్ని కుట్రలకు పితామహుడు చంద్రబాబే. ఆయన ఫోర్జరీ, మోసాలు, కుట్రలు స్థానిక ఎన్నికల్లో తారస్థాయికి చేరాయి. తొండి, అన్యాయం, దౌర్జన్యంతో స్థానిక ఎన్నికలు గెలవాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా పాతర వేస్తూ నియంతృత్వ ధోరణితో ముందుకెళ్తున్నారు.

వ్యవస్థ దిగజారిపోయింది..

స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు చేస్తున్న అక్రమాలపై గత ఆదివారం ప్రెస్‌మీట్‌లో అన్ని ఆధారాలు చూపడంతో పాటు, ఇక్కడ ఎస్ఈసీని కలిసి పూర్తి వివరాలతో ఫిర్యాదు చేశాం. ఆ తర్వాత సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించి, అన్ని ఆధారాలు చూపడంతో, సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కి తీవ్ర స్థాయిలో మొట్టికాయలు వేసింది. నామినేషన్ వేయలేకపోయిన వారికి అవకాశం ఇవ్వాలని ఆదేశించింది. ఇవి పార్టీ పరంగా జరుగుతున్న ఎన్నికలు. అలాంటప్పుడు మా పార్టీ అభ్యర్థులతో నామినేషన్ వేయించమని అడిగితే, ఎదుటి పక్షం మాకు ఆ అవకాశం ఇవ్వడం లేదు. మా పార్టీ అభ్యర్థులను నామినేషన్ వేయనివ్వడం లేదు. అంటే వ్యవస్థ దిగజారిపోయింది అనేది వాస్తవం.

ఎందుకీ డ్రామాలు.. అబద్ధాలు?

సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా ఆదేశాలిచ్చింది. అక్టోబరు 25వరకు తుది జాబితాలు ప్రకటించ వద్దని, నామినేషన్లు వేయలేకపోయిన వారికి మళ్లీ అవకాశం ఇవ్వాలని, అవసరమైతే జిల్లా కలెక్టరేట్ల వద్ద అందుకు ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. అభ్యర్థులకు స్వేచ్ఛగా నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని, వారికి పోలీస్ భద్రత కల్పించాలని, ఆ దిశలో ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ కవరేజీ ఏర్పాటు చేయాలని కూడా డీజీపీని ఆదేశించింది. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని నిర్దేశించింది. మా పార్టీ అభ్యర్థుల నామినేషన్లు వేయనిస్తే, అసలు గొడవే లేదు కదా? నిజంగా మీరు ప్రజలకు మంచి చేశామని అనుకుంటే, మా వాళ్లతో నామినేషన్లు వేయించే అవకాశం ఇచ్చి, ప్రజాతీర్పు కోరాలి. కానీ, ఆ పని చేయకుండా, మా వాళ్లను అడ్డుకోవడం ఏమిటి? మీరు ఓడిపోతారన్న భయంతోనే ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, ఎన్నికలను బుల్డోజ్ చేయాలని చూస్తున్నారు కదా? అందుకే స్థానిక ఎన్నికల్లో జరుగుతున్న దారుణాలపై సుప్రీంకోర్టు చాలా లోతుగా తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం రాజ్యాంగ మౌలిక విలువలలో భాగమని, ఎన్నికల్లో పోటీచేసే అవకాశాలు లేకుండా చేస్తే కోర్టులు తప్పకుండా జోక్యం చేసుకుంటాయని స్పష్టం చేసింది.

చంద్రబాబు ఆదేశాలను పాటిస్తున్న ఎస్ఈసీ..

అసలు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తోందా? లేక చంద్రబాబు ఆదేశాలు పాటిస్తోందా? టీడీపీ దాడులు, పోలీసులు అడ్డుకోవడం వల్ల 19 మున్సిపాలిటీల్లో మేము నామినేషన్లు వేయలేకపోయామని సుప్రీంకోర్టుకు వెళ్లాం. వాటితో పాటు, మరో 4 మున్సిపాలిటీల్లో స్క్రూటినీ పేరుతో మా వాళ్ల నామినేషన్లు తిరస్కరించారు. అంటే మొత్తం 23 అర్బన్ లోకల్ బాడీస్‌లో పోటీ లేకుండా చేశారు. పుంగనూరు, రాయచోటి, పిడుగురాళ్ల, ఎర్రగుంట్ల, కమలాపురం, గురజాల, దాచేపల్లి, దర్శి, గుత్తి, మైదుకూరు, రాజంపేట, జమ్మలమడుగు, తిరుపతి, పులివెందుల, కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, తాడిపత్రి, కనిగిరి, చిత్తూరు, నెల్లూరు, చిలకలూరిపేట, కనిగిరిలలో 15 చోట్ల ఏకంగా పోటీయే లేదు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు కూడా లేరు. 8 చోట్ల నామినేషన్లకు అస్సలు అనుమతించలేదు. గురజాల, పిడుగురాళ్ల, దర్శి, రాయచోటి, కమలాపురం, ఎర్రగుంట్ల, మైదుకూరు, పుంగనూరులో నామినేషన్లు వేయనీయలేదు. 7 చోట్ల కొన్ని నామినేషన్లు పడ్డాయి. కానీ స్క్రూటినీ పేరుతో మళ్లీ అక్రమంగా చైర్మన్ అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించారు. దాచేపల్లి, కనిగిరి, బద్వేలు, రాజంపేట, ప్రొద్దుటూరు, గుత్తి, నగరి తదితర 15 చోట్ల చైర్మన్ అభ్యర్థి లేకుండా చేశారు. ఇంకా చిత్తూరు, నగరి, చిలకలూరిపేట, నెల్లూరులో స్క్రూటినీ పేరిట నామినేషన్లు తిరస్కరించారు.
శకునిని తలపిస్తున్న చంద్రబాబు..
చంద్రబాబూ.. మీరు ఎందుకింత తొండి. దౌర్జన్యం. అన్యాయం చేస్తున్నారు. మీకు ధైర్యముంటే ఈ ఎన్నికలు ఎదుర్కోవచ్చు కదా? అసలు ఇలాంటి పరిస్థితి ఉన్నప్పుడు వీటిని ఎన్నికలు అంటారా? మహాభారతంలో శకునికి పాచికలు ఉండేవి. ఆయన కోరుకున్నట్లు నెంబర్లు వచ్చేవి. ఇక్కడ నీవు కూడా శకునిలా మారావు. నీ ఇష్టానుసారం ఎన్నికలను నిర్దేశిస్తున్నావు. ఎక్కడెక్కడ ఏం జరగాలో నీవే ఆదేశిస్తున్నావు. ఒక చోట తల (చైర్మన్) ఉండదు. కొన్ని చోట్ల కాళ్లు, చేతులు (వార్డు మెంబర్లు) ఉండవు. అంటే ఎక్కడా పూర్తిస్థాయిలో సక్రమంగా ఎన్నికలు జరగవు.

మా హయాంలో ఒక్క ఫిర్యాదైనా వచ్చిందా?

మీరు ప్రజలకు నిజంగా మంచి చేసి ఉంటే, వాటిని చూపి, మీ పనితీరు చూపి ఎన్నికల్లో ఓట్లు అడగాలి. మీరు ఆ పని చేయడం లేదు. కానీ, ఆ పని మేము చేశాం. మా హయాంలో ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్, ఆయన చంద్రబాబు నియమించిన వ్యక్తి. నాడు ఎన్నికల షెడ్యూల్ రాగానే, ఆయన ఇష్టానుసారం ఆఫీసర్లను బదిలీ చేశారు. అయినా మేం ఏమీ అనలేదు. ఎక్కడా ప్రజలకు మేలు చేయడంలో మేము వెనుకంజ వేయలేదు. ఎంతో మంచి చేశాం. అందుకే ఆ ఎన్నికల్లో విజయం సాధించాం. మేనిఫెస్టోలో చెప్పిన వాటిలో 95 శాతం అమలు చేసి చూపాం. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో పెనుమార్పులు తీసుకొచ్చాం. అందుకే ఆ ఎన్నికల్లో మేము 86 శాతం విజయం సాధించాం. కానీ ఈరోజు అంతా మోసం. సూపర్ సిక్స్ లేవు. ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు. నాడు సంతకాలు చేసి ఇంటింటికీ పంపించిన బాండ్లు ఒట్టివే అయ్యాయి. దీంతో ఎక్కడికక్కడ ప్రజలు నిలదీసే పరిస్థితి. అందుకే ఈ స్థానిక ఎన్నికలు జరగనివ్వకుండా, అన్నీ ఏకగ్రీవం అయ్యేలా తొండి, దౌర్జన్యం, అన్యాయం చేస్తున్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లలోనూ అదే తీరు..

అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసేలా తగిన భద్రత కల్పించాలని, ఏర్పాట్లు చేయాలని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ఆదేశించినా, అది అమలు చేయకుండా బరి తెగిస్తున్నారు. జంగిల్‌రాజ్ నడుపుతున్నారు. ఇక్కడ నారాసుర రక్త చరిత్ర కొనసాగుతోంది. ఎంపీటీసీలకు సంబంధించి రాష్ట్రంలోని 659 మండలాల్లో 101 మండలాల్లో జీరో నామినేషన్లు. అక్కడా అదే పద్ధతి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సమయంలో ఏం చేశారో.. ఇప్పుడూ అదే చేస్తున్నారు. నామినేషన్ కేంద్రాల్లో టీడీపీ మనుషులు ఉంటారు. వారికి పోలీసులు అండగా ఉంటారు. అక్కడికి మా పార్టీ వారు పోగానే అడ్డుకుంటున్నారు. చేతిలో నుంచి నామినేషన్ పత్రాలు లాగేసుకుంటున్నారు. చింపేస్తున్నారు. ఎవరైనా నామినేషన్ వేస్తే, చివరకు ఆర్ఓ (రిటర్నింగ్ అధికారి) చేతిలో నుంచి నామినేషన్ పత్రాలు లాక్కుని చింపేస్తున్నారు. మరో 70 మండలాల్లో 5 నామినేషన్ల కంటే తక్కువ పడ్డాయి. జడ్పీటీసీలకు సంబంధించి 227 మండలాల్లో నామినేషన్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక ఎన్నికల సందర్భంగా మా వారిపై జరుగుతున్న దాడులకు ప్రధాన కారణం.. సీఎం చంద్రబాబు. ఆయన చెప్పినట్లు ఆడుతున్న పోలీసులు. ఇతర అధికారులు. మరి వారిని బాధ్యతల నుంచి తప్పించకుండా, నిష్పక్షపాతంగా ఎన్నికలు ఎలా జరుగుతాయి? చంద్రబాబు ఒకప్పుడు పోలింగ్ కేంద్రాలను రిగ్గింగ్ చేయడం చూశాం. ఇప్పుడు ఏకంగా నామినేషన్ కేంద్రాల రిగ్గింగ్‌కు దిగజారారు. మనం గతంలో పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా పోలింగ్ కేంద్రాల రిగ్గింగ్ చూశాం.

నవంబరు నుంచి చింతలపూడి పనులు పునఃప్రారంభం

-మొదటిపేజీ తరువాయి
విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం పనులు చేపట్టాలని, అత్యుత్తమ నిపుణులను నియమించి ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని సూచించారు. చారిత్రక ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నందున నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రాజెక్టులో ఇప్పటివరకు 90.2 శాతం సివిల్ పనులు పూర్తి అయినట్టు అధికారులు సీఎంకు వివరించారు. ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌లో గ్యాప్-1, గ్యాప్-2 పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. నిపుణుల కమిటీ పలుమార్లు ప్రాజెక్టును సందర్శించి నిర్మాణ పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాలువల ద్వారా గరిష్ఠ స్థాయిలో నీటిని తరలించేలా వాటి సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ప్రాజెక్టు వద్ద నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జిని పూర్తి చేసి రాకపోకలతోపాటు పర్యాటక అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని సూచించారు. గోదావరి--పెన్నా అనుసంధానంపై కార్యాచరణ ప్రారంభించాలని, గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తరలించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రకాశం బ్యారేజికి ఎగువన, దిగువన వైకుంఠపురం, చోడవరం వద్ద ఆనకట్టల నిర్మాణం ద్వారా 14 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలన్నీ క్రియాశీలంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు, భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా విశాఖపట్నం వరకు అంతర్గత జల రవాణాకు అవసరమైన నావిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

జలధార--జలహారతి నిరంతర కార్యక్రమం

జలధార--జలహారతి రెండో దశ పనులను మార్చి 31 వరకు కొనసాగిస్తూ, 150 రోజుల కార్యక్రమంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం వీబీజీ రామ్ జీతో అనుసంధానం చేసి పనులు చేపట్టాలన్నారు. 2027 ఏప్రిల్ 1 నుంచి మూడో దశ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. భూగర్భ జలమట్టాలను మూడు మీటర్లకు పైగా పెంచే లక్ష్యంతో చర్యలు చేపట్టాలన్నారు. జలధార--జల హారతిని నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తూ వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను పెంచాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నా ప్రకృతి వ్యవసాయం ద్వారా స్థూల వ్యవసాయ ఉత్పత్తి తగ్గకుండా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే 36 ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాలువలపై సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి అన్నారు. డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టి కాలువల నిర్వహణను మెరుగుపరచాలని, పూడిక తొలగించి చిట్ట చివరి ఎకరాకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లాకులు, షట్టర్లు, గేట్ల నిర్వహణను పటిష్ఠం చేయాలని సూచించారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తత

బంగాళాఖాతంలో ఏర్పడే తుపాను ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ రిజర్వాయర్లు, చెరువులను నింపాలని సూచించారు. వరద నిర్వహణ, నీటి నిర్వహణ, విపత్తుల నిర్వహణపై సమగ్ర కార్యాచరణ అమలు చేయాలన్నారు. భూగర్భ జలాలు పెరిగేలా ముందస్తు చర్యలు చేపట్టి కరువును సమర్థంగా ఎదుర్కోవాలని చెప్పారు. వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం, సాగునీటి వనరులను సమర్థంగా నిర్వహించడం ద్వారా రైతులకు గరిష్ఠ ప్రయోజనం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, చీఫ్ ఇంజనీర్లు హాజరయ్యారు.

ముంచుకొస్తున్న 'అర్ణబ్' తుపాను

స్వర్ణసాగరం అమరావతి

రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి ఆదివారానికి వాయుగుండంగా, సోమవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. తుపానుగా మారితే దీనికి అర్ణబ్ అని పేరు పెడతారు. తుపానుగా మారిన తర్వాత ఇది ఉత్తరాంధ్ర, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలి విశాఖ పరిసరాల్లోనే తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలపై ఎక్కువగా కోస్తా జిల్లాలపై ఓ మోస్తరుగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. మరోవైపు అరేబియా సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం తమిళనాడు వరకూ విస్తరించి ఉంది. ఇది ప్రస్తుతం ఆవర్తనంగానే కొనసాగుతోంది. అది బలహీనపడితే అర్ణబ్ తుపాను ఇంకా బలపడి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఒకవేళ అది అలాగే కొనసాగితే అర్ణబ్ తుపాను తీవ్ర తుపానుగా మారే అవకాశం తగ్గుతుందని వెల్లడించారు.

వచ్చే 3 రోజుల్లో వర్షాలు కురిసే జిల్లాలు..

దీని ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళ, బుధవారాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. శనివారం అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో .. ఆదివారం అల్లూరి, పోలవరం, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తాయి. సోమవారం రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయి.

27, 28 తేదీల్లో..

27న విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. బుధవారం అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల అతి భారీ వర్షాలు కురుస్తాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మున్యం, విజయనగరం, విశాఖ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.కాగా, శుక్రవారం కర్నూలు జిల్లా దూదెకొండలో 6.8 సెంటీమీటర్ల అత్యధిక వర్షం కురిసింది.

తాడికొండలో భారీ వర్షం

అమరావతికి నిలిచిన రాకపోకలు

తాడికొండలో శుక్రవారం భారీ వర్షం కురవడంతో వాగులు పొంగి పొర్లాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమై జనాలు అవస్థలు పడ్డారు. తాడికొండ నుంచి తుళ్లూరు వెళ్లే ప్రధాన రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో అమరావతికి రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 4 గంటలు అమరావతికి వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చే విద్యార్థులు, చిన్నారులు ఇంటికి వెళ్లేందుకు తల్లిదండ్రులకు ఫోన్‌లు చేసి పిలిపించుకొని వర్షం, వరద నీటిలో నడిచి వెళ్లారు. తాడికొండ నుండి తుళ్లూరు వరకు అధ్వాన్నంగా ఉన్న రహదారిని గతేడాది పురపాలక శాఖ మంత్రి నారాయణ పరిశీలించి మరమ్మతులు చేస్తామని చెప్పారు. కానీ ఆచరణలో మాత్రం అది అమలుకు నోచలేదు.

ముగిసిన 'పరిషత్' ఎన్నికల నామినేషన్ల ఘట్టం

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. 659 జడ్పీటీసీ స్థానాలు, 9,829 ఎంపీటీసీ స్థానాల్లో నామినేషన్ల దాఖలుకు ఇవాళ సాయంత్రం 5 గంటలకు గడువు ముగిసింది. దీంతో ఈనెల 25న ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల పరిశీలన, తుది జాబితా ప్రకటన ఉంటుంది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. నేడు చివరిరోజు ప్రధాన పార్టీల అభ్యర్థులు కోలాహలంగా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం చివరిరోజున పోలీసులు కేంద్రాల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల చివరి రోజు బాపట్ల జిల్లా చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో సందడి వాతావరణం నెలకొంది. చీరాలలో టీడీపీ, వైఎస్సార్సీపీ అభ్యర్థులు ర్యాలీగా వచ్చి ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు వేశారు. నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు మద్దతుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి నామినేషన్ కేంద్రం వద్దకు వచారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో 7 మండలాల్లో ఎంపీటీసీ నామినేషన్లు పర్వం ప్రశాంతంగా సాగింది. కౌతాళంలో నామినేషన్ల దాఖలు కేంద్రాల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు మండలం నుంచి కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా పరిటాల శ్రీరామ్ నామినేషన్ దాఖలు చేశారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు శ్రీరామ్‌తో కలిసి నామినేషన్‌కు వెళ్లారు.

పోలీస్ రక్షణ మధ్య ప్రత్యేక వాహనాల్లో

సుప్రీంకోర్టు ఆదేశాలతో పురపాలక సంఘ ఎన్నికల నామినేషన్ దాఖలు సమయం పొడిగించడంతో కడప జిల్లా మైదుకూరులో వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్ వేశారు. పోలీస్ రక్షణ మధ్య ప్రత్యేక వాహనాల్లో నామినేషన్ కేంద్రం వద్దకు వచ్చి నామపత్రాలు సమర్పించారు. కడప జిల్లా వేంపల్లిలో నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్సీపీ శ్రేణులను విడాలమిట్ట కాలేజీ రోడ్డు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వైఎస్సార్సీపీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.
మార్కాపురం జిల్లా యర్రగొండపాలెంలో నామినేషన్ వేసేందుకు వెళ్లనీయడం లేదంటూ పెద్ద సంఖ్యలో వైఎస్సార్సీపీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. రహదారిపై బైటాయించారు. నామినేషన్ కేంద్రం వద్ద గుంపులు గుంపులుగా వెళ్లడం నిషేధమని అభ్యర్థి తనతో పాటు మరో ఇద్దరినీ అనుమతిస్తామని పోలీసులు సర్దిచెప్పారు. నామపత్రాలు సమర్పించే అభ్యర్థులను క్యూ లైన్ ద్వారా ఒక్కొక్కరిని లోపలికి పంపించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంచంగిపుట్టు మండలంలో నామినేషన్లు కోలాహలంగా సాగింది. అనకాపల్లి జిల్లా రోలుగుంట, రావికమతం, మాకవరపాలెం, గొలుగొండ ప్రాంతాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు

అంతకుముందు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్లు వేసేందుకు ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫిర్యాదులు వస్తే వెంటనే వారిని కాంటాక్ట్ చేసి నామినేషన్ వేసేందుకు అవసరమైన రక్షణ కల్పించాలని రిటర్నింగ్ అధికారులను, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీలు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఎస్పీలు, ఆర్వోలు గడువులోగా నామినేషన్లు వేయించేలా చూడాలని ఆదేశించింది. ఆయా జిల్లాల ఎస్పీలు, పోలీసులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసింది.

swarna sagaram_Swarna sagaram.qxd 10/23/2026 11:15 PM Page 1

కురగొండ ఎంపీటీసీ బరిలో డాక్టర్ దారా అంకయ్య

కురగొండ ఎంపీటీసీ అభ్యర్థిగా డాక్టర్ దారా అంకయ్య నామినేషన్

వినాయకుడు,నాగరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు

ఓజిలి(స్వర్ణ-సాగరం)అక్టోబర్ 23:

తిరుపతి జిల్లా ఓజిలి మండలం కురగొండ ఎంపీటీసీ అభ్యర్థిగా కురగొండ పీఏసీఎస్ అధ్యక్షులు డాక్టర్ దారా అంకయ్య శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు ముందు గ్రామంలోని వినాయక స్వామి, నాగరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సుమారు వందమంది పార్టీ కార్యకర్తలు, అనుచరులతో ర్యాలీగా బయలుదేరి నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో ఎన్నికల సందడి నెలకొంది. కార్యకర్తలు, అనుచరుల సమక్షంలో ఆయన నామినేషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామస్థుల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలిచినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఓజిలి మండల అధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్ నాయుడు, ప్రకాష్ నాయుడు,ఖలీల్ తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్.వై పాలెం ఎంపీటీసీగా మైలా. కోటేశ్వరరావు నామినేషన్

350 మందితో భారీ ర్యాలీ.. టీడీపీ అభ్యర్థికి నాయకుల మద్దతు

స్వర్ణ సాగరంపొదలకూరు అక్టోబర్ 23

మండలంలోని ఆర్.వై పాలెం సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థిగా మైలా. కోటేశ్వరరావు శుక్రవారం భారీ జనసందోహం మధ్య నామినేషన్ దాఖలు చేశారు. కలువాయి రోడ్డు నుంచి సుమారు 350 మంది కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా బయలుదేరి నామినేషన్ కేంద్రానికి చేరుకుని నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు పులిపాటి వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ.. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పొదలకూరు అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా పొదలకూరుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసిన నాయకుడు సోమిరెడ్డి అని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రి, మెగా మినరల్ వాటర్ ప్లాంట్, సోమశిల దక్షిణ కాలువ, కండలేరు ఎడమ కాలువకు లిఫ్ట్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులను ప్రస్తావిస్తూ.. శాశ్వత ప్రయోజనాలు చేకూర్చే పనులకు టీడీపీ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత సీ .ఎస్ .ఆర్ ఫండ్ గతంలో ఎన్నడూ లేని విధంగా పొదలకూరులో డయాలసిస్ సెంటర్ ,సైకిళ్ల పంపిణీ ,మెగా మినరల్ వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ ,అలాగే నుడా నిధులతో పొదలకూరు పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు ఇలా అభివృద్ధికి మారుపేరుగా నిలిచారని పేర్కొన్నారు .ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు టీడీపీ,కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.భారీ ర్యాలీతో నామినేషన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన తిరుచ్చి ఎన్ఐటీ బృందం

శ్రీసిటీ,స్వర్ణ సాగరం అక్టోబర్ 23, 2026:

తిరుచిరాపల్లి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) డైరెక్టర్ డాక్టర్ జి.అఖిలా శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. ఆమెతో పాటు రిజిస్ట్రార్, డీన్లు, ప్రొఫెసర్లు, ఇతర ఉన్నతాధికారులు పర్యటనలో పాల్గొన్నారు.శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ బృందానికి సాదర స్వాగతం పలికారు. తాను చదువుకున్న ఎన్ఐటీ తిరుచిరాపల్లి నుంచి ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థిగా కళాశాల మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు పరిశ్రమల్లో ప్రత్యక్ష అనుభవం కల్పించడంలో విద్యాసంస్థలు--పరిశ్రమల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను ప్రతినిధి బృందానికి వివరించారు. శ్రీసిటీ త్రీడీ నమూనా, వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలు, ఇక్కడ తయారవుతున్న ఉత్పత్తులను ప్రదర్శించారు. ఐఐఐటీ, క్రియా యూనివర్సిటీ, శ్రీసిటీ ఇంటర్నేషనల్ స్కూల్ వంటి ప్రముఖ విద్యాసంస్థల ఉనికిని వివరిస్తూ, పరిశ్రమలతో పాటు విద్యారంగానికి కూడా శ్రీసిటీ ఒక ముఖ్యమైన కేంద్రంగా ఎదుగుతోందని వివరించారు.అనంతరం ప్రతినిధి బృందం శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్స్టామ్, డేనియెలీ, పానాసోనిక్, థెర్మాక్స్ పరిశ్రమలను సందర్శించారు. పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రక్రియలు, ఆధునిక తయారీ విధానాలు, పారిశ్రామిక సామర్థ్యాలను పరిశీలించారు. ఈ పర్యటనపై డాక్టర్ అఖిలా మాట్లాడుతూ, శ్రీసిటీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, ఆధునిక పరిశ్రమల పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో శ్రీసిటీతో కలిసి పనిచేసేందుకు తమ సంస్థ ఆసక్తిగా ఉందని తెలిపారు.ఈ పర్యటన ఎన్ఐటీ తిరుచిరాపల్లి, శ్రీసిటీ మధ్య సంస్థాగత సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్తులో ఉమ్మడి పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి కొత్త అవకాశాలను అన్వేషించేందుకు వేదికగా నిలిచింది.

పొదలకూరు బిట్-3 వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా కోవూరు వెంకటేశ్వర్లు నామినేషన్

పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలు సమర్పించిన అభ్యర్థి

స్వర్ణ సాగరంపొదలకూరుఅక్టోబర్ 23

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పొదలకూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల సందడి కొనసాగుతోంది. పొదలకూరు బిట్-3 ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోవూరు వెంకటేశ్వర్లు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆయన ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు మద్దతు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పీ

రేణిగుంట స్వర్ణ సాగరం అక్టోబర్ 23

రేణిగుంట ఎంపీడీవో కార్యాలయం వద్ద జరుగుతున్న ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను అదనపు ఎస్పీ పరిశీలించారు. కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, విధుల్లో ఉన్న పోలీసులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు.

రాజ్యాంగ నిర్మాత చేతికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ పత్రాలు

రేణిగుంట స్వర్ణ సాగరం అక్టోబర్ 23

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా రేణిగుంట మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లను తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకుని, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. దీనిని నిరసిస్తూ వైయస్సార్‌సీపీ అభ్యర్థులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నామినేషన్ పత్రాలను అందజేశారు.ఎలక్షన్ కమిషన్, జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి మా చేత నామినేషన్ వేయించాల్సిన బాధ్యత తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

పోలీసుల పటిష్ట పహారాలో నామినేషన్ల పర్వం

రేణిగుంట స్వర్ణ సాగరం అక్టోబర్ 23

రేణిగుంట మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుంది. చివరి రోజు సాయంత్రం 4 గంటల వరకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం టీడీపీ నుంచి 12, వైసీపీ నుంచి 11, సీపీఐ(ఎం) నుంచి 6, జనసేన నుంచి 2, బీజేపీ నుంచి 2, ఇండిపెండెంట్‌గా ఒక నామినేషన్ దాఖలైనట్లు సమాచారం. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రేణిగుంట అర్బన్, రూరల్ సీఐలు ఎస్ జయచంద్ర, మంజునాథ్ ల ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నామినేషన్ల కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు కొనసాగడంతో ప్రక్రియ ప్రశాంతంగా సాగింది.

RNI : APTEL/26/A2367 OFFICE : 9440352036
SWARNA SAGARAM TELUGU DAILY
స్వర్ణసాగరం
తిరుపతి తెలుగు దినపత్రిక
చిత్తూరు | నెల్లూరు | అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాల తయారీపై మూడు రోజుల శిక్షణ

నెల్లూరు, స్వర్ణ సాగరం అక్టోబర్ 23:

కృషి విజ్ఞాన కేంద్రం (కె.వి.కె.), నెల్లూరు ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ (దీ=జ) స్థాపన అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కె.వి.కె. సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి డా. ఎన్.వి. సరళ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక (ౌజుూ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమంలో జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాల ప్రాముఖ్యత, వాటి వినియోగం, తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం, బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా షెడ్యూల్డ్ కులాల యువత, రైతులకు సేంద్రియ మరియు పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు, జీవ ఎరువులు, జీవ నియంత్రణ కారకాల తయారీ మరియు వినియోగం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని కె.వి.కె. సస్యరక్షణ శాస్త్రవేత్త డా. డి. విజయ్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల షెడ్యూల్డ్ కులాల యువత మరియు రైతులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. పేరు నమోదు మరియు ఇతర వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 9490004254.ద

నాయుడుపేటలో నేడు రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపికలు

నాయుడుపేట (స్వర్ణ-సాగరం), అక్టోబర్ 23:

తిరుపతి జిల్లా ట్రెడిషనల్ సీనియర్ పురుషులు, మహిళల రెజ్లింగ్ జట్టు ఎంపికలు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నాయుడుపేటలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో నిర్వహించనున్నట్లు జిల్లా రెజ్లింగ్ చైర్మన్ డాక్టర్ ఆదవరం అనుదీప్, కార్యదర్శి బి. ఉదయ్ కుమార్ తెలిపారు.ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. 20 సంవత్సరాలు పైబడిన వారు ఎంపికల్లో పాల్గొనవచ్చుని, 18, 19 సంవత్సరాల వయస్సు కలిగిన క్రీడాకారులు మెడికల్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు. పురుషుల విభాగంలో 57, 65, 74, 86, 97, 118 కేజీల బరువు విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నారు. మహిళల విభాగంలో 50, 53, 57, 62, 68, 76 కేజీల బరువు విభాగాల్లో ఎంపికలు జరగనున్నాయి. ఆసక్తి కలిగిన అర్హులైన క్రీడాకారులు నిర్ణీత సమయానికి ఎంపికల ప్రాంగణానికి చేరుకోవాలని నిర్వాహకులు కోరారు. ఎంపికలకు సంబంధించిన ఇతర వివరాల కోసం 9000024837 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎంపీటీసీ పోటీ బరిలో నలుగురు సిపిఎం పార్టీ అభ్యర్థులు

రేణిగుంట స్వర్ణ సాగరం అక్టోబర్ 23

రేణిగుంట మండలంలో జరిగే స్థానిక ఎన్నికల్లో నలుగురు సిపిఎం పార్టీ అభ్యర్థులు మూడు ఎంపీటీసీ సెగ్మెంట్ స్థానాలకు పోటీ చేసే నామినేషన్ దాఖలు పత్రాలను ప్రత్యేక ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించడం జరిగిందని సిపిఎం పార్టీ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ శుక్రవారం నాడు పత్రికా ఱ ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటన ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ- భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం పార్టీ సుత్తిబి కొడవలిబి నక్షత్రం గుర్తు ద్వారా రేణిగుంట 3వ సెగ్మెంట్ ఎన్నికల బరిలో మహిళా సంఘం మండల అధ్యక్షురాలు కామ్రేడ్ బలిపంగి భారతి, రేణిగుంట 2వ సెగ్మెంట్ ఎన్నికల బరిలో కార్మిక నేత కామ్రేడ్ కాంజేరి సెల్వరాజు, కరకంబాడి 3వ సెగ్మెంట్ ఎన్నికల బరిలో కార్మిక నేత కామ్రేడ్ పాతపాటి దీప పోటీలో నిలబడగా, ఇదే కరకంబాడి 3వ సెగ్మెంట్ కు కామ్రేడ్ ఎస్. సత్య శ్రీ మరొక నామినేషన్ దాఖలు వేయడం జరిగిందని తెలిపారు. సిపిఎం పార్టీ ద్వారా ఎన్నికల బరిలో నిలబడి పోటీ చేస్తున్న ఎంపీటీసీ అభ్యర్థులకు రేణిగుంట, కరకంబాడి, తారకరామనగర్ ఓటర్లు తమ అమూల్యమైన ఓటును సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు కు ఓటు వేసి ఓటు హక్కుబి విలువ పెంచాలి.. ప్రజల తరపున పాలకులను, అధికారుల తప్పులను ప్రశ్నించే, పోరాడే ఎర్రజెండా సిపిఎం పార్టీ కే మీ ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్థానిక ఎన్నికల్లో సిపిఎం పార్టీ అభ్యర్థులను బలపరచడం ద్వారా ప్రజా ఉద్యమాలు ప్రజా గొంతు బలపడతాయని ఈ సందర్భంగా కొండ్రెడ్డి హరినాథ్ ఒక ప్రకటన ద్వారా ఓటర్లకు పిలుపు ఇచ్చారు.

ఎంపీటీసీ గా నామినేషన్ వేసిన సిపిఐ అభ్యర్థి బి.శాంతి

రేణిగుంట స్వర్ణ సాగరం అక్టోబర్ 23

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలో శుక్రవారం ఎంపీటీసీ (సీపీఐ) అభ్యర్థి బి.శాంతి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యలపై పోరాడుతున్న కమ్యూనిస్టులను గెలిపించాలన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి స్థానిక సంస్థల లలో కష్టజీవుల గొంతుకగ, నిధులను తమ స్వార్థం కొరకు గాక ప్రజల సేవకు ఉపయోగిస్తారని అన్నారు.ఎ.ఐ.టి.యు.సి జిల్లా కార్యదర్శి కె.రాదాకృష్ణ తన హృదయపూర్వక సహకరిస్తామన్నారు అనంతరం మండల కార్యదర్శి వై.యస్.మణి మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఎ.ఐ.టి.యు.సి మండల కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసి రాజన్, పార్టీ సీనియర్ నాయకులు మురళి, మాజీ మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, రజాక్, సెల్వ, వినయ్, తరుణ్, అమ్ములు, శివగామి, దాము, హరి, పెంచలయ్య తదితర ప్రజా సంఘాలు కార్మిక సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 10/23/2026 11:15 PM Page 2

రిక్షా కార్మికుడి కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ పరామర్శ ఆర్థిక సాయం

మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్

స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా అక్టోబర్ 23

హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని 20వ వార్డుకు చెందిన రిక్షా కార్మికుడు పిల్లుట్ల రమణయ్య రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ మృతుడి నివాసానికి చేరుకుని భౌతికకాయాన్ని పరిశీలించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర వేదనలో ఉన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి,వారికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు .కష్టకాలంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని,అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు దొంతగాని జగన్, మధు,అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి గూడూరు నుంచి 87 నామినేషన్లు దాఖల్

రిటర్నింగ్ అధికారి బాలసుబ్రమణ్యం వెల్లడి.

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం అక్టోబర్ 23

స్థానిక సంస్థల ఎన్నికల లో భాగంగా తోటపల్లి గూడూరు మండలం నుంచి 14 సెగ్మెంట్లకు గాను 87 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే బాలసుబ్రమణ్యం పాత్రికేయులకు వివరించారు మొత్తం నామినే షన్లలో తెలుగుదేశం నుంచి 37 యువజన శ్రామిక రైతు పార్టీ నుంచి 46 బహుజన సమాజ్ పార్టీ నుంచి 3స్వతంత్రుల నుంచి 1ఉందన్నారు. పరిశీలన తర్వాత 27 నామినేషన్ల ఉపసంహరణ లో సంబంధిత అభ్యర్థులు వారి వారి పూర్తి ఆధారాలతో స్వయంగా రావలసి ఉంటుందన్నారు ఆయా పార్టీల ల బీఫార్మ్ అభ్యర్థులు సమర్పించుకోవాలన్నారు. తుది జాబితా ప్రకటిస్తామన్నారు

స్పందనకు వందనం.. సకాలంలో భారీ వృక్షం తొలగింపు!

స్వర్ణ సాగరం పొదలకూరు అక్టోబర్ 23

పొదలకూరు--నెల్లూరు ప్రధాన రహదారిపై నేలకొరిగిన భారీ వేప వృక్షాన్ని విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు, పంచాయతీ సిబ్బంది, యువ నాయకుడు ఆదాల మురళి సకాలంలో స్పందించి తొలగించారు. చెట్టు రోడ్డుపై పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రజలకు, వాహనదారులకు కలిగిన ఇబ్బందులను తొలగించడంలో చొరవ చూపిన విపత్తుల నిర్వహణ శాఖ, పంచాయతీ సిబ్బంది, యువ నాయకుడు ఆదాల మురళిపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

"గిరిజన భాషలు" "భారతీయ భాషలే"

విశాఖపట్నం సెమినార్ లో డాక్టర్ గురు ప్రసాద్

నెల్లూరు స్వర్ణ సాగరం అక్టోబర్ 23

భారతీయ భాషా సమితి న్యూఢిల్లీ ప్రోత్సాహంతోఆంధ్ర యూనివర్సిటీ శక్తిపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ ఆవరణంలో గిరిజన భాషలు భారతీయ భాష లే సందర్భంగా నిర్వహించిన సెమినార్ చర్చా గోష్టిలో నెల్లూరు జయభారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ డాక్టర్ గురు ప్రసాద్ పాల్గొన్నారుఈ సందర్భంగా గిరిజన భాషలలో ప్రధానంగా గిరిజనులకు విద్యపై గల ఆసక్తిఆయా భాషలలో గల ప్రావీణ్యత నాగరికత ఇతర విషయాలపైతన అభిప్రాయాన్ని వివరించారు. ఈ సెమినార్ లో ముఖ్య అతిథులుగా ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ రాజశేఖర్ సినిమా లిరిక్స్ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు ఏకలవ్య ఫౌండేషన్ హైదరాబాద్ ప్రతినిధి పి వేణుగోపాల్ రెడ్డి ప్రిన్సిపాల్ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఒ టెక్నాలజీ ఎం వి ఆర్ రాజు కన్వీనర్లు పివి లక్ష్మీనారాయణ ాఖజూ డిసంధ్య దీప్తిూఖజూ ఆహూతులు పాల్గొన్నారు

రేణిగుంట నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు

రేణిగుంట స్వర్ణ సాగరం అక్టోబర్ 23

ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రేణిగుంట ఎంపీడీవో కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి, తహసీల్దార్ శ్రావణ్ కుమార్ కలిసి పరిశీలించారు. కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, విధుల్లో ఉన్న పోలీసులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తోటపల్లి గూడూరు నుంచి నామినేషన్లు

దాఖలు చేసిన టిడిపి వైయస్సార్సీపి బీఎస్పీ స్వతంత్ర అభ్యర్థులు

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం అక్టోబర్ 23

తోటపల్లి గూడూరు మండలం లోని 14 సెగ్మెంట్లకు గాను శుక్రవారం చివరి రోజు టిడిపి వైఎస్ఆర్సిపి బీఎస్ పి నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధానంగా కోడూరు మేజర్ పంచాయతీ ప్రాదేశికాలు 1 నుంచి 8 కోడూరు 2 నుంచి 7వరిగొండ 1 నుంచి 72 నుంచి 8 అధికంగా నామినేషన్లు రాగా మల్లికార్జునపురం నుంచి 5 వరకవిపూడి నుండి 6 పోట్లపూడి నుంచి4 వెంకన్నపాలెం నుంచి 6 ఈదూరునుంచి 7తోటపల్లి గూడూరు నుంచి 4సౌత్ ఆములూరు నుంచి 7నరుకూరు నుంచి 6ఇసుక పాలెం నుంచి 5 పేదూరు నుంచి 7దాఖలైనాయి

కోడూరు పంచాయితీకి పూర్వ వైభవం తెస్తాం

ఎంపీటీసీలుగా పోటీ చేస్తున్న "బూదూరు""కావల్ రెడ్డి"...శివాలయంలో వాగ్దానం చేసిన అభ్యర్థులు

తోటపల్లి గూడూరుస్వర్ణ సాగరం అక్టోబర్ 23

కోడూరు మేజర్ పంచాయితీకి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో పూర్వవైభవం తీసుకొస్తామని ఎంపీటీసీ బరిలో పోటీకి దిగిన బూదూరుకోడూరు మేజర్ పంచాయతీని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపించి పూర్వవైభవం చేకూరుస్తామని ఎంపీటీసీల బరిలో ఉన్న బూదూరుశ్రీనివాసులు కావల్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు మండలం కోడూరు మేజర్ పంచాయతీ నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా భగవంతుని ఆశీస్సులు కోరుకుంటూ

కోడూరు శివాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నేతలు పూజలు నిర్వహించారు. మేజర్ పంచాయతీ కోడూరు బిట్1కోడూరు బిట్టు 2 ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి బూదూరుశ్రీనివాసులు అదేవిధంగా 2వప్రాదేశికం నుంచి కావల్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి ఇరువురు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాలతో పోటీకి సిద్ధమైనారు.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ స్థానిక టిడిపి నేతలు కార్యకర్తలు గ్రామ ప్రజలసంపూర్ణ సహకారంతో పోటీలో ఉన్నట్లు తెలిపారుకోడూరు మేజర్ పంచాయతీ అభివృద్ధికి తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కోడూరు శ్రీ కోటేశ్వర స్వామి శివాలయం లో వాగ్దానం చేస్తున్నట్లు తెలిపారుఈ కార్యక్రమంలో కోడూరు సాగునీటి సంఘంమాజీ అధ్యక్షులు వీరబోయిన గంగాధర్నీటి సంఘం ఉపాధ్యక్షులుచెరుకూరు పరంధామయ్య దువ్వూరు శ్రీనివాసుల రెడ్డి స్థానిక నేతలు ఉన్నారు

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల దాఖలుకు అవకాశం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

స్వర్ణ సాగరం పూతలపట్టు, అక్టోబరు 23

చిత్తూరు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం పూతలపట్టు ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.గత మూడు రోజులుగా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని, ఇప్పటివరకు జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని తెలిపారు. మండల స్థాయిలో కూడా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగుతోందని పేర్కొన్నారు.నామినేషన్ల దాఖలుకు ఇంకా సమయం ఉన్నందున అర్హులైన అభ్యర్థులు నిబంధనల ప్రకారం నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించి ఎవరికైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను లేదా జిల్లా ఎస్పీ తుషార్ డూడిని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

ఎంపీటీసీ నామినేషన్లు వేసేందుకు అనుమతి ఇవ్వండి

అధికారులను కోరిన పూతలపట్టు వైఎస్ఆర్సిపి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్

స్వర్ణ సాగరం పూతలపట్టు అక్టోబర్ 23

పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎంపీటీసీ ఎన్నికలలో నామినేషన్ వేసేందుకు అధికారులు అనుమతి ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న జిల్లా జెసి ఆదర్శ రాజేంద్రన్ ధర్నా చేస్తున్న వారికి నచ్చజెప్పి నామినేషన్లు వేయించారు . ధర్నా కార్యక్రమంలో పూతలపట్టు వైఎస్ఆర్సిపి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్, వైఎస్ఆర్సిపి మేధావుల సలహా సంఘం సభ్యులు జగదీశ్వర్ రెడ్డి,మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ అభ్యర్థులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కళత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌కు జనసేన పార్టీ తరఫున వి. థామస్ నామినేషన్

స్వర్ణ సాగరం కె వి బి పురం:

జనసేన పార్టీ కేవీబీ పురం మండల అధ్యక్షులు మరియు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త వి. థామస్ కళత్తూరు ఎంపీటీసీ సెగ్మెంట్‌కు నామినేషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని, గ్రామ అభివృద్ధికి కృషి చేయడమే తన ధ్యేయమని వి. థామస్ తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజాసేవకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు.

ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించండి.

పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్

స్వర్ణ సాగరం పూతలపట్టు అక్టోబర్ 23

పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీటీసీ ఎన్నికలు ప్రక్రియలో భాగంగా చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ దూడి ,జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రకుమార్ న్నికలు పరిశీలనకు వచ్చిన సందర్భముగా పూతలపట్టు శాసనసభ్యులు అధికారులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు సజావుగా నిర్వహించాలని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను వైఎస్ఆర్సిపి పార్టీ వారు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ,అటువంటివారిని గుర్తించి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

బైరెడ్డిపల్లి మండలంలో అట్టహాసంగా సాగిన నామినేషన్ల పర్వం

స్వర్ణసాగరం బైరెడ్డిపల్లి అక్టోబరు 23:-

బైరెడ్డిపల్లి మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల దాఖలు కార్యక్రమం సందడిగా సాగింది. ఆయా పంచాయతీల పరిధిలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ మద్దతుదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నామినేషన్ కేంద్రాలకు తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో బైరెడ్డిపల్లి మండల కేంద్రంతో పాటు నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎన్నికల సందడి నెలకొంది.ఈ సందర్భంగా బైరెడ్డిపల్లి మండల పార్టీ అధ్యక్షులు బి.ఎం. కిషోర్ గారి కార్యాలయం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులతో కిక్కిరిసిపోయింది. పార్టీ శ్రేణుల రాకతో కార్యాలయం వద్ద సందడి వాతావరణం కనిపించింది. టీడీపీ తరఫున బరిలో నిలుస్తున్న అభ్యర్థులకు స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి నామినేషన్ పత్రాలను

అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులు నిబంధనల మేరకు నామినేషన్లు దాఖలు చేసి, తదుపరి ఎన్నికల కార్యక్రమాలకు సిద్ధమయ్యారు.సదరు కార్యాలయం నుంచి అభ్యర్థులు తమ అనుచరులు, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా నామినేషన్ కేంద్రాలకు బయలుదేరారు. ఈ క్రమంలో కార్యకర్తల నినాదాలు, నాయకుల సందడి మధ్య ఎన్నికల వాతావరణం స్పష్టంగా కనిపించింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించి ప్రక్రియను పూర్తి చేశారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాప్రతినిధుల ఎంపికలో కీలకమైనవిగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. రానున్న రోజుల్లో ప్రచార కార్యక్రమాలు, అభ్యర్థుల ప్రజాసంపర్కం మరింత చురుకుగా సాగే అవకాశం ఉంది.మొత్తంగా బైరెడ్డిపల్లి మండలంలో నామినేషన్ల దాఖలు కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తల హాజరుతో ఎన్నికల సందడి నెలకొనగా, తదుపరి ఎన్నికల ప్రక్రియపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి కనిపించింది.

గుడిపాల జడ్పిటిసి అభ్యర్థి గా ఈశ్వర్ కళ్యాణ్ అభయ ట్రస్ట్ అధినేత మమత ఈశ్వర్ నాయుడు

బంగారుపాలెం,స్వర్ణసాగరం,అక్టోబర్ 23

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం బొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్ అభయ ట్రస్ట్ అధినేత ఈశ్వర్ నాయుడు సతీమణి మమత శుక్రవారం గుడిపాల జడ్పిటిసి స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. జడ్పీ చైర్మన్ స్థానానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో తనకు జడ్పీ చైర్మన్ పదవి రావడం తథ్యమని ఆమె మీడియా ముఖశీగా తెలిపారు.తన భర్త ఈశ్వర్ నాయుడు ఈశ్వర్ అభయ ట్రస్ట్ ద్వారా బంగారుపాళ్యం మండలంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ మండలంలోని ప్రభుత్వ, ప్రవేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు నోటు పుస్తకాలు, ఫ్యాడ్లు,జామింట్రీబాక్సులు,పెన్నులు,ప్రతి సంవత్సరం పిల్లలకు అందిస్తూ గ్రామాల్లో సిమెంట్ రోడ్లు ఉచితంగా వేస్తూ పలు సేవకార్యక్రమాలు చేస్తూ ప్రజలు మన్నాలను పొందు తున్నారు కనుక తనను గుడిపాల జడ్పీటీసీ అభ్యర్థి గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు

బంగారుపాళ్యంలో నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్,ఎస్ పి

బంగారుపాళ్యం,స్వర్ణసాగరం,అక్టోబర్ 23

బంగారుపాళ్యం మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక సంస్థల నామినేషన్ల ఘట్టం ముగిసింది.చివరి రోజు అయిన శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మరియు ఎస్పీ తుషార్ డూడి బంగారుపాళ్యం నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి భరోసా ఇవ్వడంతో వైసిపి శ్రేణులు నామినేషన్ కేంద్రానికి తోడుగా వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సునీల్ కుమార్ దగ్గరుండి వైసిపి అభ్యర్థులను నామినేషన్ కేంద్రానికి తరలించారు. నామినేషన్ల గడువు ముగిసే సమయానికి బంగారుపాళ్యం మండలం నుండి టిడిపి 68 జనసేన ఎనిమిది వైసిపి 22 ఇండిపెండెంట్ లు రెండు నామినేషన్లు దాఖలు చేశారు బంగారుపాళ్యం మండలంలో తెలుగుదేశం పార్టీ కి మొగిలి,టేకుమంద, బంగారుపాళ్యం 1,గుంతూరు,నలాగాంపల్లి, మహాసముద్రం, రాగిమానుపెంట,తుంబ పంచాయతీ లలో వైఎస్సార్ పార్టీ కి నామినేషన్లు వేయకపోవడంతో తెలుగుదేశం జనసేన పార్టీ లకు ఏకగ్రీవంగా కానున్నాయి 41 పంచాయతీ లు వున్న బంగారుపాళ్యం మండలం నుండి వైఎస్సార్ పార్టీ తరుపున జడ్పీటీసీ అభ్యర్థి ని నిలపెట్టక పోవడం గమనార్హం

మార్కాపురం మెప్మా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కనిగిరి జడ్పీటీసీ అభ్యర్థి మల్లెల ప్రవీణ్ కుమార్ నామినేషన్ దాఖలు!

కనిగిరి స్వర్ణ సాగరం అక్టోబర్ 23

స్థానిక సంస్థల ఎన్నికల పర్వంలో భాగంగా మార్కాపురం మెప్మా కార్యాలయం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు. కనిగిరి మండలం జడ్పీటీసీ వైఎస్సా ర్‌సీపీ అభ్యర్థిగా మల్లెల ప్రవీణ్ కుమార్ తన నామినేషన్ పత్రాలను అత్యంత అట్టహాసంగా సమర్పించారు.ఈ నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి కనిగిరి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, అనుచరులు పాల్గొన్నారు.నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం నాయకులు కనిగిరి జడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలవడంతో పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ వ్యూహాత్మక అడుగులు, క్షేత్రస్థాయిలో పనిసేసి ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో కనిగిరి స్థానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతోందని పార్టీ ముఖ్య నేతలు అత్యంత ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సెట్టిపల్లి కొండయ్య యేండ్లురి కిరణ్ మల్లెల యాకోబు బాబు రామకోటయ్య పౌల్ తదితరులు పాల్గొన్నరు.

వి ఆర్ ఏ పరుశురామయ్య పార్థవదేహానికి వి ఆర్ ఏ రాష్ట్ర అధ్యక్షులు నివాళులు .

మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి .

స్వర్ణసాగరం వాకాడు

వాకాడు మండలం తహశీల్దార్ కార్యాలయం కేంద్రంలోని వాకాడు గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) చిట్టేటి పరశురామయ్య రోడ్డు ప్రమాదంలో మరణించడం తీవ్ర విషాదం నింపింది అని ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం విచారం వ్యక్తం చేశారు.వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర నేతలు బృందం మృతుని భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వాకాడు మండలం తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ తో వీఆర్ఏల స్థితిగతులపైన చర్చించారు. మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వం నుండి రావలసిన గ్రూప్ ఇన్సూరెన్స్,గ్రాట్యుటీ,ఇతర సౌకర్యాలు వెంటనే అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. శ్రీహరి,రాష్ట్ర కార్యదర్శి ఎం. అంకయ్య, సీనియర్ నేతలు వి.లచ్చయ్య, బి.విజయ్,వీఆర్ఏలు కస్తూరయ్య,కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ పరిశీలించిన జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్

స్వర్ణ సాగరం పూతలపట్టు అక్టోబర్ 23

చిత్తూరు జిల్లా జనరల్ అబ్జర్వర్ ఎల్.శివశంకర్, వ్యయ పరిశీలకులు సి సిదానందం సార్వత్రిక సంస్థల ఎన్నికలు –2026 సందర్భంగా పూతలపట్టు మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో కి పలు సూచనలు చేశారు.

డబ్బు,మద్యం లాంటి ప్రభోవలకు లోనవ్వకుండా మిమ్మల్ని గెలిపించుకుంటాం

కొయ్యలగూడెం స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం నందు ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి వద్దకి మూడో సెగ్మెంట్ ప్రజలు చేరుకొని 1999 లో గ్రామానికి మేఘలాదేవి చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకుంటూ మా ప్రాంత ఎంపీటీసీ అభ్యర్థిగా మీరు పోటీ చేయడం మాకు ఎంతో ఆనందదాయకంగా ఉందని కొయ్యలగూడెం మదర్ తెరిసా గా పిలుచుకునే మా అమ్మను మేము డబ్బు,మద్యం లాంటి ప్రభోవలకు లోనవ్వకుండా మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత మా అందరిది అని మీరు మాకు అండగా ఉంటూ అభివృద్ధి చేయడంలో కూడా మీకు మీరే సాటని మీలాంటి వారే మాకు కావాలని మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత మాదని మహిళలు మేఘలాదేవి నివాసం వద్దకు చేరుకుని వారి సంతోషాన్ని వ్యక్తపరిచారు.

పోలవరం ఎంపీపీ అభ్యర్థినిగా మైగాపుల విజయ దుర్గ నామినేషన్

పోలవరం స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

పోలవరం మండల వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థినిగా మైగాపుల విజయ దుర్గ నామినేషన్ దాఖలు చేశారు,రిటర్నింగ్ అధికారి కె.రవి ప్రసన్నకుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు.వైఎస్సార్‌సీపీ అభ్యర్థినిగా ఎన్నికల బరిలోకి మైగాపుల విజయ దుర్గ.రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాల సమర్పణ.నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు,నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, గొంతు వేణు, పొడుం శ్యాంకుమార్ హాజరు,అభ్యర్థికి మద్దతుగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, పోలవరం మండలంలో ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి నెలకొంది.

పోలవరం జడ్పీటీసీ కూటమి అభ్యర్థినిగా మొగళ్ల జానకి సత్య గోవర్ధ సౌమ్య నామినేషన్

పోలవరం స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

పోలవరం మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థినిగా జనసేన పార్టీ తరఫున జానకి సౌమ్య నామినేషన్ దాఖలు చేశారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మొగళ్ళ హరిబాబు భార్య అయిన ఎన్నికల బరిలో నిలిచారు,జనసేన పార్టీ తరఫున జడ్పీటీసీ అభ్యర్థినిగా జానకి సౌమ్య పోటీ,కూటమి అభ్యర్థినిగా ఎన్నికల బరిలోకి అడుగుపెట్టిన జానకి సౌమ్య.గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి,అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థన,పోలవరం మండల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని వెల్లడి,స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలవరం మండలంలో రాజకీయ సందడి నెలకొంది.

వేదాంతపురం రామానుజపురం ఎంపీటీసీ నామినేషన్ల కార్యక్రమం

కొయ్యలగూడెం స్వర్ణ సాగరం ప్రతినిధి అశోక్

ఈరోజు వేదాం తపురం, రామానుజ పురం గ్రామాలకు సంబంధించిన ఎంపీటీసీ నామినేషన్ల కార్యక్రమం విజయవంతంగా జరిగింది,ఈ సందర్భంగా వేదాంతపురం గ్రామం నుంచి నేదునూరి సుబ్బారాయుడు ,రామానుజపురం గ్రామం నుంచి ఎర్రమళ్ళ రాజు ఎంపీటీసీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు,ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాలకు చెందిన నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థులకు తమ మద్దతు తెలియజేశారు,ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులిద్దరికీ శుభాకాంక్షలు తెలియచేశారు.

మగధీరుడు..“కామిరెడ్డి” జైలు నుండి జడ్పీటీసీకి నామినేషన్...

పెళ్లకూరు స్వర్ణసాగరం అక్టోబర్23

అలుపు ఎరగని ధీరుడు.... భయం అన్నది తెలియని ధైర్యశాలి... శత్రువులు ఎంతమంది ఎదురైనా వెనకడుగు వేయని మగధీరుడు... వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డి సి సి బి మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అక్రమ కేసులో అరెస్టు అయ్యి నెల్లూరు సబ్ జైల్లో రిమాండ్ లో ఉన్నప్పటికీ ప్రజాసేవ కోసం... కార్యకర్తలకు తోడుగా ఉండేందుకు... పార్టీ శ్రేణుల్లో బలాన్ని, ధైర్యాన్ని నింపేందుకు పెళ్ళకూరు జెడ్పిటిసి స్థానానికి నామినేషన్ వేసిన ధైర్యశాలి, రాజకీయ కురువృద్ధుడు సత్యనారాయణ రెడ్డి. గతంలో కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిలో నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుకతవకాలు చేపట్టడానికి గుర్తించి రైతులతో కలిసి అడ్డుకొని కూటమి నాయకులచే అక్రమ కేసులకు గురై 97 రోజులు జైలు జీవితం అనుభవించారు. అదేవిధంగా చిల్లకూరులో జరిగిన వ్యవసాయ భూముల వద్ద వివాదం విషయంలో మరోసారి అక్రమ కేసుకు గురై నెల్లూరు సబ్ జైల్లో రిమాండ్ లో ఉన్నారు.

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు రాష్ట్రమంతటా రాజకీయ వేడి కూటమి అక్రోషాలు నెలకొంటున్న తరుణంలో పెళ్ళకూరులోని 10 ఎంపీటీసీ స్థానాలకు ఏడు స్థానాలు నామినేషన్ వేయకుండా అధికార పార్టీ అల్లరిమోకలు అడ్డుకోవడం జరిగింది. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో పెళ్ళకూరు జడ్పిటిసి అభ్యర్థులుగా సత్యనారాయణ రెడ్డి తో పాటు ఆయన భార్య కామిరెడ్డి ప్రభావతమ్మ, పార్టీ యువనేత సాగి జితేంద్ర లతో పెళ్ళాకూరు జెడ్పిటిసి స్థానానికి నామినేషన్ వేసి మరోసారి ధైర్యాన్ని చాటి చెప్పుకున్నారు. పంచాయతీ పోరుకు అందరూ సిద్ధం కావాలంటూ పంచాయతీ ఎన్నికల సమయానికి సత్యనారాయణ రెడ్డి మండల ప్రజలందరికీ అందుబాటులోకి వచ్చేస్తారంటూ ఆయన సతీమణి ప్రభావతమ్మ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపడం మరో విశేషం. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూటమి నాయకులు చేస్తున్న కుట్రలకు అనుక్షణం గురి అవుతూనే కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ కోసం శ్రమిస్తూ అలుపెరుగని పోరాటం చేస్తున్న సత్యనారాయణరెడ్డిని అన్యాయంగా జైల్లో పెట్టినప్పటికీ పెళ్ళకూరు జడ్పిటిసిగా అత్యధిక మెజారిటీతో విజయం అంకితం గా ఇవ్వాలని మండల ప్రజలను పార్టీ శ్రేణులను ప్రభావితమ్మ మన స్పూర్తిగా విజ్ఞప్తి చేస్తుంది. అందువల్ల మండలంలోని అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా కూటమి కుట్రలను నిర్వీర్యం చేస్తూ ఓటు అనే ఆయుధంతో సత్యనారాయణ రెడ్డిని మనస్పూర్తిగా దీవించాలని ఆమె కోరారు.

ఘనంగా కందేరి కార్తీక్ చౌదరి నామినేషన్

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల నామినేషన్ కార్యక్రమం ఉత్సాహభరితంగా మారింది. మండలంలోని కారనీ పంచాయతీ, వెస్ట్ వరత్తురూ పంచాయతీ మరియు నేరిని కండ్రిగ పంచాయతీలకు సంబంధించి కందేరి కార్తీక్ చౌదరి ఎంపీటీసీ నామినేషన్ శుక్రవారం కార్యక్రమం అత్యంత వైభవంగా మరియు భారీ జనసందోహం మధ్య సాగింది. పార్టీ శ్రేణులు, నాయకులు మరియు స్థానిక ప్రజలు అత్యంత ఉత్సాహంతో ఈ కార్యక్రమంలో పాల్గొని తమ మద్దతును ఘనంగా చాటారు. పసుపు జెండాలు, నినాదాలతో ఈ ప్రాంతమంతా తెలుగుదేశం పార్టీ పసుపు మయంగా మారింది.ఈ సందర్భంగా వివిధ పంచాయతీల నుంచి తరలివచ్చిన పార్టీ ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు కందేరి కార్తీక్ చౌదరికి ఘనస్వాగతం పలికారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి కార్తీక్ చౌదరి నిరంతరం కృషి చేస్తారని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి. అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా, పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ నామినేషన్ మహోత్సవం పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్తేజాన్ని నింపడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఘన విజయం సాధించబోతున్నామనే నమ్మకాన్ని బలపరిచింది.

శ్రీరంగరాజపురం మండల. -ఎంపీటీసీ ఎన్నికలకు 48 నామినేషన్లు.

శ్రీరంగరాజపురం :స్వర్ణసాగరం: అక్టోబర్ 23 :

శ్రీరంగరాజపురం మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో 11 ఎంపీటీసీ స్థానాలకు గాను, అక్టోబర్ 21వ నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల్లో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు, స్వతంత్ర అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించడం జరిగిందని రిటర్నింగ్ అధికారి ఉమా మహేశ్వరి తెలిపారు.

అధికార తెలుగుదేశం పార్టీ (18,
ప్రధాన ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ20,
జనసేన పార్టీ 7,
ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 2,
స్వతంత్ర అభ్యర్థిగా 1 నామినేషన్ దాఖలు చేసినట్లు వివరించారు.

మార్కాపురం మెప్మా కార్యాలయంలో కనిగిరి బీజ్ పార్టీ ZPTC అభ్యర్థిగా హై కోర్ట్ లాయర్ గూడూరి వినోద్ కుమార్

కనిగిరి స్వర్ణ సాగరం అక్టోబర్ 23

స్థానిక సంస్థల ఎన్నికల పర్వంలో భాగంగా మార్కాపురం మెప్మా కార్యాలయం బీసీవై పార్టీ తరుపున బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు కనిగిరి మండలం జడ్పీటీసీ (గ్రాజ) బీసీవై అభ్యర్థిగా గూడూరి వినోద్ కుమార్ తన నామినేషన్ పత్రాలను అత్యంత అట్టహాసంగా సమర్పించారు.ఈ నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి కనిగిరి మండలానికి చెందిన బీసీవై ముఖ్య నాయకులు, అనుచరులు పాల్గొన్నారు.నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం నాయకులు కనిగిరి జడ్పీటీసీ ఎన్నికల బరిలో నిలవడంతో పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో కనిగిరి స్థానాన్ని బీసీవై పార్టీ కైవసం చేసుకోబోతోందని పార్టీ ముఖ్య నేతలు అత్యంత ధీమా వ్యక్తం చేశారు.

నియంత పాలనకు ప్రజలు స్వస్తి పలకాలి - పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి

నామినేషన్ల అడ్డగింత పై పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఫైర్

కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యానికి రక్షణ ఎక్కడ

పోలీసుల తీరు ప్రజాస్వామ్యానికే అవమానం

స్వర్ణసాగరం కోట 23)

స్థానిక ఎంపీటీసీ నామినేషన్ల సందర్భంగా కోట మండల కేంద్రంలో చోటుచేసుకున్న పరిణామాలపై వైసీపీ పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యులు పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని, ఎక్కడో 144 సెక్షన్ కి కిలో మీటర్ దూరంలోనే మమ్మల్ని ఆపి నామినేషన్ వెయ్యనీకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో ఇది ఒక మచ్చని అయన ఆరోపించారు.అంతేకాకుండా, ఎంపీడీఓ కార్యాలయానికి కూటమి నాయకులు తాళాలు వేసి నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం చేసారని ప్రజాస్వామ్యంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి ఒక్కరి హక్కని నామినేషన్ వేసే వారి హక్కునే అడ్డుకుంటే ప్రజాస్వామ్యానికి అర్థం ఏమిటి చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే ప్రేక్షక పాత్ర పోషిస్తే సామాన్యులకు న్యాయం ఎక్కడ దొరుకుతుంది ప్రశ్నించారు.

రెండో విడత నామినేషన్ల ఘట్టం ముగిసింది.

కట్టుదిట్టమైన భద్రత నడుమ నామినేషన్లు !

స్వర్ణ సాగరం,సూళ్లూరుపేట అక్టోబర్ 23 :

రెండో విడత నామినేషన్ల ఘట్టం ముగియగడంతో మూడో రోజైన శుక్రవారంతో ప్రశాంత వాతావరణంలో ముగిసింది.నామినేషన్లకు చివరి రోజు కావడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తూ,అభ్యర్థులు మినహా ఇతరులను లోపలికి అనుమతించకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది.దీంతో రెండో విడత నామినేషన్ల ఘట్టం ప్రశాంత వాతావరణంలో ముగిసింది.

ప్రాణరక్షణలో పోలీసుల సాహసం

బాపట్ల స్వర్ణసాగరం న్యూస్

పోలీసులంటే నేరస్థులకు భయం కలిగించడమే కాదు.. ఆపదలో ఉన్న సామాన్య ప్రజలకు అండగా నిలిచి ప్రాణాలను కాపాడటం కూడా తమ బాధ్యతేనని బాపట్ల రూరల్ పోలీసులు మరోసారి నిరూపించారు. సూర్యలంక బీచ్‌లో సముద్రపు అలలకు కొట్టుకుపోతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న తెలంగాణ యువకుడిని పోలీసులు, మెరైన్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సమన్వయంతో స్పందించి కాపాడారు.తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన కొలిపాక శ్రీకాంత్ (25) శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2.45 గంటల సమయంలో సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానం చేస్తుండగా అలల తాకిడికి కొట్టుకుపోయి మునిగిపోతుండగా అక్కడ విధుల్లో ఉన్న బాపట్ల రూరల్ పోలీస్ అవుట్‌పోస్ట్ సిబ్బంది, మెరైన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. గజ ఈతగాళ్ల సహాయంతో యువకుడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చి, వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాపట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.జిల్లా ఎస్పీ ఆదేశాలు, రూరల్ సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో పోలీసులు తీర ప్రాంత భద్రతపై ప్రత్యేక దృష్టి సారించడం ఈ ఘటనలో కీలకంగా నిలిచింది. ముఖ్యంగా పర్యాటకుల రద్దీ సమయాల్లో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ, ప్రమాదాలను ముందుగానే గుర్తించి స్పందించడం ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. నేర నియంత్రణతో పాటు ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలోనూ పోలీసులు ముందుంటారనే విషయాన్ని ఈ ఘటన చాటిచెప్పింది. యువకుడి ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బంది, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లపై పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.

కనిగిరిలో దద్దాల నారాయణ యాదవ్ ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

కనిగిరి స్వర్ణ సాగరం అక్టోబర్ 23

కనిగిరి నియోజకవర్గం వైయస్ఆర్‌సీపీ ఇంఛార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ని శుక్రవారం ఉదయం వారి నివాసంలో పోలీస్ లు హౌస్ అరెస్ట్ చేశారు.వైయస్ఆర్‌సీపీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులకు మద్దతుగా నామినేషన్ కేంద్రం వద్దకు వెళ్లొద్దంటూ పోలీసులు నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారు.ప్రజాస్వామ్యంలో ఇలాంటి చీకటి రోజులు వస్తాయని ఎప్పుడూ అనుకోలేదని కనిగిరి వైసీపీ ఇంచార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేశారు.దయచేసి మా పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బంది పెట్టవద్దని, ప్రశాంతంగా నామినేషన్ వేసేందుకు సహకరించాలని ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ కనిగిరి ఎస్పై ని అభ్యర్థించారు.

మనస్ఫూర్తిగా "వేలూరు"ను దీవించండి

పెళ్లకూరు స్వర్ణసాగరం అక్టోబర్ 23

మండలంలోని శిరసనంబేడు ప్రాదేశిక సెగ్మెంట్ కు తెలుగుదేశం పార్టీ తరఫున టిడిపి యువనేత శిరసనంబేటి కళ్యాణ్ రెడ్డి సతీమణి వేలూరు మోహన రూపారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కె ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వేలూరు కళ్యాణ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కళ్ళకూరు మండలం శిరసనంబేడు ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. శిరసనంబెడు, జీలపాటూరు చెన్నప్ప నాయుడుపేట పంచాయతీలలోని ఓటర్లందరూ మనస్ఫూర్తిగా దీవించి ఆశీర్వదించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ప్రాదేశిక విభాగంలో ఉన్న మూడు ప్రాంతాల ఓటర్లు ఓట్లు వేసి భారీ మెజారిటీ అందివ్వాలని కోరారు.

రోమియో జూలియట్' మూవీ రొమాంటిక్ యాక్షన్ పోస్టర్

హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న 'రోమియో జూలియట్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. భార్గవ్ మాచర్ల రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ సమర్పిస్తుండగా, నవరస ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సుందీప్ ఎన్, వెంకటేశ్వరరావు చల్లగుళ్ల నిర్మిస్తున్నారు.

దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 'రోమియో జూలియట్' నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ రొమాన్స్, యాక్షన్ అంశాల కలయికతో ఆకట్టుకుంటోంది.పోస్టర్‌లో హర్షిత్ సన్‌గ్లాసెస్ ధరించి, చేతిలో గన్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. విశాఖ ధిమాన్ ఎరుపు రంగు దుస్తుల్లో అందంగా కనిపిస్తున్నారు. చుట్టూ ముళ్ల తీగలు, ఎర్ర గులాబీలు, గాలిలో ఎగురుతున్న పూలరేకులు కనిపిస్తున్నాయి. బుల్లెట్లు పోస్టర్‌కు యాక్షన్ ఫీల్‌ను తీసుకొస్తే, గులాబీలు, ఎరుపు రంగు రొమాంటిక్ కోణాన్ని హైలైట్ చేస్తున్నాయి.

ఇప్పటికే రెబల్ స్టార్ ప్రభాస్ విడుదల చేసిన ఈ సినిమా 'స్టోరీ రివీల్' గ్లింప్స్ కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ట్యుయేషన్‌షిప్స్, క్యాజువల్ రిలేషన్‌షిప్స్, బ్రేకప్స్, యువ జంటల మధ్య మారుతున్న సంబంధాలను 'రోమియో జూలియట్' ప్రజెంట్ చేయనుంది. నేటి యువత తమ ప్రేమ సంబంధాల్లో ఎదుర్కొంటున్న అనుభవాలు, ఆలోచనలకు అద్దం పట్టే కథతో జెన్-జెడ్ ప్రేక్షకులని అలరించేలా వుంటుంది.

ఈ సినిమాలో వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

భార్గవ్ మాచర్ల, ప్రశాంత్ రాగతి కథను అందించగా, గోపీసుందర్ సంగీతం సమకూరుస్తున్నారు. అభిరాజ్ నాయర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, యువ కిరణ్ ఎడిటింగ్ . కార్తా ప్రొడక్షన్స్ ధీరజ్ పొనుగోటి, ప్రకీర్తి ఉప్పలపాటి ప్రొడక్షన్ డిజైనర్స్.

నటీనటులు: హర్షిత్, విశాఖ ధిమాన్, వైవా హర్ష, సిరి హనుమంత్, ప్రసాద్ బెహరా, ప్రభాస్ శ్రీను, అజయ్ ఘోష్, అజయ్

రియాలిటీ' మూవీ నుంచి వీడియో సాంగ్ 'భజ గోవిందం' రిలీజ్

ప్రామిసింగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో నిత్యజీవితంలోని సహజమైన భావోద్వేగాలను, మన చుట్టూ ఉండే చిన్న చిన్న ఆనందాలను అందంగా ప్రజెంట్ చేయడానికి సిద్ధమవుతున్నారు. 'క', 'కె-రాంప్' చిత్రాల విజయాలతో జోరుమీదున్న ఆయన, ఈ సినిమాకు హీరోగా నటించడంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే అందించి దర్శకత్వం కూడా వహిస్తున్నారు. తన కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మేకర్స్ తాజాగా ఈ సినిమా సంగీత ప్రయాణాన్ని ప్రారంభిస్తూ తొలి పాట 'భజ గోవిందం' ఫుల్ వీడియోను విడుదల చేశారు. గతంలో విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు మంచి స్పందన లభించగా, ఈ పాట సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది. 'రియాలిటీ' జీవితానికి ఆంథమ్‌లా నిలిచే ఈ పాట, జీవితంలోని చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే సినిమా ప్రధాన సందేశాన్ని అందంగా ఆవిష్కరిస్తోంది. భీమ్స్ సిసిరోలియో ప్రశాంతమైన, భక్తిభావంతో కూడిన మెలోడీని స్వరపరిచారు. సనారే అందించిన అర్థవంతమైన సాహిత్యం మన దగ్గర ఉన్నదానితో సంతృప్తిగా ఉండటం, మనం చేసే పనిని ప్రేమించడం, స్వయంగా ఎదగడం ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. జీవితంలోని బాధ్యతల మధ్య మన కోసం మనం కొంత సమయాన్ని కేటాయించుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ పాట గుర్తుచేస్తోంది. వైకోమ్ విజయలక్ష్మి వాయిస్ పాటకు ఆధ్యాత్మిక, ఆహ్లాదకరమైన అనుభూతిని అందించింది. సంగీతానికి తగ్గట్టుగా రూపొందించిన విజువల్స్‌లో పల్లెటూరి జీవితంలోని అందం కనిపిస్తుంది. కిరణ్ అబ్బవరం హోటల్ నడుపుతూ, స్నేహితులు, కుటుంబ సభ్యులతో విలువైన క్షణాలను ఆస్వాదించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఆయన సహజమైన నటన, హావభావాలు రోజువారీ జీవితంలోని చిన్న చిన్న సంఘటనలకు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చాయి. ప్రతి సన్నివేశం నిజ జీవితానికి దగ్గరగా, మనసుకు హత్తుకునేలా ఉంది. ఆకట్టుకునే సంగీతం, ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే భావోద్వేగాలతో 'భజ గోవిందం' 'రియాలిటీ' సినిమాకు తగిన ఆంథమ్‌గా నిలుస్తోంది.

జడి సినిమా గ్లింప్స్ విడుదల..

ఒడియాలో ఘన విజయం సాధించిన 'జడి చిత్రాన్ని మెగా ప్రొడక్షన్స్ అధినేత ఉడుగుల అశ్విని కుమార్ గౌడ్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. శ్రీయాన్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాజల్ రే నిర్మించిన ఈ చిత్రానికి దిబ్య జ్యోతి ఉదయ సింగ్ రచన, దర్శకత్వం వహించారు. సైలేంద్ర సమంతరాయ్, ప్రియంబద స్వైన్, ఆకాశ్ హోతా ప్రధాన పాత్రల్లో నటించగా.. సుశాంత్ దాస్ మహాపాత్ర, రబి మిశ్రా, బాలకృష్ణ నాయక్, కృష్ణ రౌత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం కామెడీ క్రైమ్ డ్రామాగా తెరకెక్కింది. తాజాగా తెలుగు ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. ఈ కథ గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. కాలేజీ యువకుల మధ్య స్నేహం, అనుబంధాలతో ప్రారంభమై.. ప్రేమకథగా మారుతూ, స్నేహితుల మధ్య తలెత్తే విభేదాలు, సంఘర్షణలను ఆసక్తికరంగా పరిచయం చేస్తుంది. ప్రేమకథకు మించి జీవితంలోని విభిన్న భావోద్వేగాలు, బంధాలను ఈ చిత్రం ఆవిష్కరించనుంది.

'జో జో' కాషన్ 2 సినిమా ఇంట్రెస్టింగ్ వీడియో రిలీజ్

హీరో, హీరోయిన్‌ని ప్రేమిస్తానంటాడు.. దానికి బదులుగా"పడుచు పిల్ల కానొస్తే... ఓ నాలుగు దినాలు వెనక పడి... పని కానిచ్చుకొని... పారిపోయే టైపా? ఇష్టపడిన పిల్లని దాని బాధ్యతలతో సహా పెళ్ళి చేసుకొని దాన్ని జీవితాంతం మోసెంత గుండకాయ ఉన్న మొగోడి టైపా అని" ఆ పిల్ల ప్రశ్నిస్తాది .. దానికి హీరో బదులిస్తూ.. "సత్య ప్రమాణికంగా చెబుతున్నా ఒకతూరి మాట ఇచ్చినానంటే మడమ తిప్పని వంశం మాది... బాలయ్య బాబు టైపు" అని హీరో గడుసుగా సమాధానం ఇస్తాడు. హీరోయిన్ మరి హీరోని ప్రేమిస్తాదా! అని తెలియాలంటే మాత్రం 'జో జో' సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. కృష్ణ కమల్ , మహి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న రూరల్ కామెడీ డ్రామా 'జో జో'. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రముఖ దర్శకుడు దేవకట్టా సమర్పణలో కిరణ్ జయ్ కుమార్ దర్శకుడిగా రూపొందుతోంది. విజయం బ్యానర్‌పై విజయ్ కృష్ణ లింగమనేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

Edited Printed Published & Owned by Embeti Kameswari. And Printed at VSR Publishers and Printers, #1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. Published at VSR Publications, 1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR Embeti Kameswari, PRGI. NO. APTEL/26/A2367